శనివారం
02-03-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 250
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నావల్నీ భౌతికకాయం తరలింపునకు వాహన డ్రైవర్ల విముఖత

మాస్కో: రష్యాలో ప్రతిపక్షనేత అలెక్సీ నావల్నీ భౌతికకాయాన్ని తరలించేందుకు వాహన డ్రైవర్లు విముఖత చూపుతున్నారు. ఒకవేళ ఎవరైనా డ్రైవర్ ముందుకొస్తే వారికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు అతడి టీమ్ ప్రతినిధి కీరా యార్మిష్ పేర్కొన్నారు. ఇప్పటికే నావల్నీ బృందం అతికష్టం మీద అంత్యక్రియలకు ఒక వేదికను సిద్ధం చేసుకోగలిగింది. తొలుత ఆయన బృందం చాలా వేదికలను సంప్రదించగా బిజీగా ఉన్నామని చెప్పటమో... నావల్నీ పేరు చెప్పగానే నిరాకరించడమో చేశారు. గురువారమే ప్రజల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించగా అది సాధ్యం కాలేదు.

'ఇండియా' కూటమితోనే

ప్రత్యేక హోదా



- మోదీ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- 'ఏపీలో కాంగ్రెస్‌కు పునరుజ్జీవం తెస్తాం
- కాంగ్రెస్ నేత సచిన్ పైలట్

విశాలాంధ్ర-తిరుపతి : 'ఇండియా' కూటమితోనే ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధ్యమని ఏఐసీసీ నేత, రాజస్తాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ అన్నారు. తిరుపతి నగరం తారకరామా స్టేడియంలో శుక్రవారం 'ఇండియా కూటమి' అధ్వర్యంలో న్యాయసాధన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన సచిన్ పైలట్ మాట్లాడుతూ తన తండ్రి రాజేష్ పైలట్‌కు ఏపీతో ఎంతో మంచి సంబంధం ఉండేదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మంత్రివర్గంలో తీర్మానం చేశారని... ఆ మంత్రివర్గంలో తానూ ఉన్నట్లు సచిన్ పైలట్ గుర్తు చేశారు. అయితే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక పదేళ్లుగా ఏపీకి ప్రత్యేక హోదా విషయం విస్మరించారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి మంత్రివర్గ సమావేశంలోనే ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఆ విషయం చెప్పడానికే తాను తిరుపతిలో నిర్వహించిన న్యాయసాధన సభకు విచ్చేసినట్లు ఆయన చెప్పారు. ప్లానింగ్ కమిషనులో ప్రత్యేక హోదా గురించి పాస్ చేశామన్నారు. అయినా ప్రత్యేక హోదా ఇవ్వక పోవడం శోచనీయమని సచిన్ పైలట్ అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే ఉద్దేశమే బీజేపీకి లేదన్నారు. మోదీ చొరవ చూపక పోవడమే ఇందుకు కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రైతులు, వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాలను మోదీ మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. హిందు, ముస్లింల మధ్య కూడా విద్వేషం రగుల్చుతున్నారన్నారు. ప్రాంతీయ పార్టీలతో ప్రత్యేక హోదా సాధ్యం

- మిగతా 2 లో

పోలీస్ కర్కశం

- 'చలో సీఎం క్యాంపు కార్యాలయం' ఉద్రిక్తం
- ప్రత్యేక హోదాపై ఉద్యమించిన విద్యార్థి, యువజన నేతల అరెస్ట్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గృహనిర్బంధం
- దాసరి భవన్ వద్ద పోలీస్ బలగాల మోహరింపు
- తాడేపల్లిలో చలసాని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ అరెస్ట్
- మోసగించే పార్టీలకు ఘోరీ కడతాం: ఈశ్వరయ్య హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ... ఇందుకోసం ముఖ్యమంత్రి జగన్ అఖిలపక్ష సమావేశం తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన 'చలో సీఎం క్యాంపు కార్యాలయం' ఆందోళన కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కుంచనపల్లిలోని ఆయన నివాసం వద్దే గృహ నిర్బంధం చేయగా... దాసరి భవన్ నుంచి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు, కార్యకర్తలు సీఎం క్యాంపు కార్యాలయానికి ప్రదర్శనగా బయలుదేరారు. అప్పటికే దాసరి భవన్ వద్ద పెద్దఎత్తున మోహరించిన పోలీస్ బలగాలు వారిని అడ్డుకుని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారు. ఈసందర్భంగా పోలీసులకు, విద్యార్థి, యువజన సంఘాల నేతలకు వాగ్వాదం చోటు చేసుకుంది. శాంతియుతంగా చేస్తున్న ప్రదర్శనను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. కాని పోలీసులు ఇవేమీ పట్టించుకోకుండా కర్కశంగా వ్యవహరించి అరెస్టు చేశారు. ఆందోళనకారులను ఈడ్చుకెళ్లి వ్యానుల్లో బలవంతంగా ఎక్కించారు. ప్రధాని మోదీ ఇచ్చిన తిరుపతి సభలో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని అమలు చేయమని అడిగితే అరెస్టు చేయటం ఏమిటి? కేంద్రం మెడలు వంచి హోదా తీసుకువస్తానని మాటిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు తీసుకురాలేని ప్రశ్నిస్తే కేసులు పెట్టటం ఏమిటి?అని నేతలు నిలదీశారు. రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువజనులు బీజేపీని, వైసీపీని ఇంటికి సాగనంపడం ఖాయమని హెచ్చరించారు.

విద్యార్థి, యువజన సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేస్తున్న సందర్భంగా నేతలు విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా విషయంలో ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఘోరీ కడతామని హెచ్చరించారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అధికార ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు రాజీనామా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జీ ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు వి. జాన్సన్ బాబు, కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. అమ్మ పెట్టదు, అడుక్కు తిననివ్వదన్న చందంగా ఆంధ్రప్రదేశ్ పరిస్థితి తయారైందని వారు

- మిగతా 2 లో

ఉద్ధవ్ పార్టీకి 20... కాంగ్రెస్‌కు 18

మహారాష్ట్రలో కుదిరిన సీట్ల సర్దుబాటు

ముంబై: మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి మధ్య లోక్‌సభ సీట్ల సర్దుబాటు కుదిరింది. మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలు ఉండగా శివసేన (యూబీటీ) 20 సీట్లలో పోటీ చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ 18 చోట్ల, శరద్ పవార్ ఎన్సీపీ 10 చోట్ల బరిలోకి దిగనుంది. సీట్ల కేటాయింపునకు సంబంధించి అధికార ప్రకటన రావాల్సి ఉంది. శరద్‌పవార్ నివాసంలో శుక్రవారం కూటమి నేతలు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి నానా పటోల్, పృథ్వీరాజ్, వర్ష గైక్వాడ్, ఎన్సీపీ నుంచి జయంత్ పాటిల్, జితేంద్ర, అనిల్ దేశ్‌ముఖ్, శివసేన యూబీటీ నుంచి సంజయ్ రౌత్, వినాయక్ రౌత్ పాల్గొన్నారు. ఇటీవల కూటమిలో

- మిగతా 2 లో

పేదోడి భవిష్యత్ కోసం

యుద్ధం చేస్తున్నా

- మంచి జరిగిందని భావిస్తే అండగా నిలవండి
- విద్యారంగంలో భారీ మార్పులు తెచ్చి రూ.73 వేల కోట్లు ఖర్చు చేశాం
- విద్యాదీవెన కింద రూ.708 కోట్లు జమ చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పేదవాడి భవిష్యత్ కోసం పెత్తందార్లతో తాను యుద్ధం చేస్తున్నానని, తన వల్ల మంచి జరిగిందని భావిస్తే అండగా నిలవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న విద్యా దీవెన పథకం అక్టోబరు-డిసెంబరు-2023 త్రైమాసికం నిధులను శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రులో జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్ బటన్ నొక్కి రూ.708 కోట్ల నిధులు

- మిగతా 2 లో

వైసీపీకి ఓటేస్తే మళ్లీ కష్టాలే

వివేకా కేసులో ప్రజాతీర్పు కోరుతున్నా: సునీత

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఐదేళ్లుగా మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ముందుకు సాగడం లేదని, న్యాయం కోసం తాను పోరాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ప్రజాకోర్టులో తీర్పు కోరుతున్నానని, వైసీపీకి ఓటు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

- మిగతా 2 లో

టీడీపీ నేతలపై

అక్రమ కేసులు

- ప్రభుత్వ వ్యవస్థల దుర్వినియోగం
- సీఎం జగన్‌పై గవర్నర్‌కు చంద్రబాబు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సీఐడీని జేబు సంస్థగా మార్చుకుని ప్రత్యర్థి పార్టీ నేతలపై కేసులు పెట్టి వేధిస్తున్నారని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల అణచివేతే లక్ష్యంగా అధికార పార్టీ అక్రమ కేసులు పెడుతోందని, ప్రభుత్వం వ్యవస్థలను రాజకీయ కక్షల కోసం వాడుకుంటోందని ఆ లేఖలో పేర్కొన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడి అక్రమ అరెస్టును ప్రస్తావిస్తూ ఏపీఎస్‌డీఆర్ఐ దుర్వినియోగాన్ని ఆయన ప్రస్తావించారు. ఏపీఎస్‌డీఆర్ఐ ద్వారా తెలుగుదేశం నేతలను బెదిరించి ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బందులకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మా నియోజకవర్గంలో భారీస్థాయిలో ఓట్లను గల్లంతు చేసి ఎన్నికలకు నేను సిద్ధమయిపోయాను సార్!

నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి

- మంగళగిరి బరిలో మురుగుడు లావణ్య
- కర్నూలుకు విశ్రాంత ఐఏఎస్ ఇంతియాజ్
- ముగ్గురితో వైసీపీ తొమ్మిదో జాబితా విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ తొమ్మిదో జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక లోక్‌సభతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలకు ఇన్‌ఛార్జిలను నియమించారు. నెల్లూరు లోక్‌సభ ఇన్‌ఛార్జిగా వి.విజయసాయిరెడ్డి, కర్నూలు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా ఐఏఎస్

- మిగతా 2 లో

కులం, మతం పేరిట

ఓట్లడగవద్దు

- ప్రార్థనా స్థలాల్ని ప్రచారానికి వినియోగించరాదు
- నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాజకీయ పార్టీలు, నేతలకు ఈసీ హెచ్చరిక

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నవేళ రాజకీయ పార్టీలు, నేతలకు ఎన్నికల సంఘం (ఈసీ) కీలక సూచనలు చేసింది. కులం, మతం, భాషల ప్రాతిపదికన ఓట్లు అడగడం మానుకోవాలని హెచ్చరించింది. భక్తి-దైవ సంబంధాన్ని అవమానించవద్దని లేదా దైవ దూషణకు ఎటువంటి సూచన

- మిగతా 2 లో

తెలుగు రాష్ట్రాలకు

ఎండలే ఎండలు

న్యూఢిల్లీ: దేశంలో ఎండలు మండిపోనున్నాయి. మార్చి నెలకు నాలుగైదు రోజుల ముందు నుంచే ఉష్ణోగ్రతలు పెరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉండనుంది. ఎల్‌నినో పరిస్థితులు ఈ సీజన్‌లో కొనసాగుతాయని అంచనా వేసిన నేపథ్యంలో ఈ ఏడాది వేసవి కాలం భారత్ మరింత మండిపోయే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ)

- మిగతా 2 లో

ఆహారం కోసం వస్తే చంపేస్తారా?

గాజాలో ఇజ్రాయిల్ నరమేధంపై ప్రపంచ దేశాల ఆగ్రహం

టెల్‌అవివ్: గాజా నగరంలో మానవతా సాయం కోసం ఎదురు చూస్తున్న పౌరులపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేయడాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఈ దాడిలో 104 మంది మరణించారు. సుమారు వెయ్యిమంది వరకు గాయాలపాలయ్యారు. తొలుత వైమానిక దాడి జరిపిన ఇజ్రాయిల్ సైన్యం ఆ తరువాత ట్రక్కులవద్ద ఆహార పదార్థాల కోసం ఎగబడిన వారిపై కాల్పులు జరిపిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఒక్కసారిగా ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయడంతో జరిగిన తొక్కిసలాటలోనూ కొందరు చనిపోయారు. ఇక గాజాపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉన్న దేశాలు కూడా ఈ ఘోరకలిపై ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాట్లాడుతూ... ఇలాంటి ఘటనలు కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలను మరింత జటిలం చేస్తాయన్నారు. అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ దీనిపై పూర్తి సమాచారం పంపించాలని తాము ఇజ్రాయిల్‌ను కోరినట్లు వెల్లడించారు. ఈ ఘటనకు బాధ్యులు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ 'ఆహారం కోసం వచ్చిన ప్రజలపై కాల్పులు జరపడాన్ని ఏమాత్రం సమర్థించుకోలేరు' అని అన్నారు. పెద్ద ఎత్తున పలస్తీనా వాసులు ఆహార కొరత, అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. అంతర్జాతీయ చట్టాలకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండటంతోపాటు సాయం అందించే ట్రక్కులను గాజాలోకి వెళ్లనీయాలని స్పష్టం చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మేక్రాన్ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... పౌరులను ఇజ్రాయిల్ సైన్యం లక్ష్యంగా చేసుకుందని మండిపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇజ్రాయిల్ చర్య ఏమాత్రం ఆమోద యోగ్యం కాదని ఐరోపా సమాఖ్య పేర్కొంది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఇజ్రాయిల్ చర్యను ఖండించారు. గాజా వాసులకు తక్షణమే సాయం అందించాలని తెలిపారు. అక్కడ దాదాపు వారం రోజుల నుంచి తమ సిబ్బంది పనిచేయలేకపోతున్నారన్నారు. టర్కీ ప్రభుత్వం స్పందిస్తూ.. మానవత్వంపై పాల్పడ్డ నేరంగా దీనిని అభివర్ణించింది. 'ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగానే అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొంది' అని ఆ దేశ విదేశాంగశాఖ పేర్కొంది. ఇజ్రాయిల్‌తో ఉన్న ఆయుధ కొనుగోలు ఒప్పందాలను సస్పెండ్ చేస్తున్నట్లు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ప్రకటించారు. గాజాలో చర్యలను నరమేధంగా అభివర్ణించారు. 'ఆహారం అడిగిన 100 మందిని మీరు చంపారు నెతన్యాహు' అని ఆయన ఎక్స్‌లో పోస్టు

చేశారు. ఖతార్, సౌదీ దేశాలు కూడా ఇజ్రాయిల్ తీరును తప్పుపట్టాయి.

సైన్యంపై దాడి...అందుకే కాల్పులు జరిపామన్న ఇజ్రాయిల్

ఈ ఘటనను ఇజ్రాయిల్ ధ్రువీకరించింది. అయితే సైనికులపై దాడి చేసేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. ఆహారం కోసం జరిగిన తోపులాట, తొక్కిసలాటతోపాటు జనంపై నుంచి ట్రక్కులు వెళ్లడంతో డజన్ల మంది మరణించారని పేర్కొంది. జనాన్ని చెదరగొట్టేందుకు సైన్యం కాల్పులు జరిపిందని, దీంతో చాలా మంది కార్ల కింద దాక్కున్నారని, తూటాల వర్షం నిలిచిపోయాక మళ్లీ ఆహార సంచుల కోసం ఎగబడ్డారని, దీంతో మరోసారి కాల్పులు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు వివరించారు. ఈ ఘటనను మారణ హోమంగా గాజా ఆరోగ్యశాఖ పేర్కొంది. మరోవైపు గాజాలో ఇప్పటివరకూ 30,035 మంది మరణించారని, 70,457 మంది గాయపడ్డారని ప్రకటించింది.

ఢాకా రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

43 మంది మృతి

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఆ దుర్ఘటనలో సుమారు 43 మంది మృతి చెందగా... డజన్ల సంఖ్యలో జనం గాయాలపాలయ్యారు. ఏడు అంతస్తుల భవనంలో ఈ ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం వల్ల 43 మంది చనిపోయినట్లు బంగ్లాదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సమంత లాల్ సేన్ తెలిపారు. గాయపడ్డవారు ప్రస్తుతం ఢాకా మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నారు. బర్న్ హాస్పిటల్‌లో దాదాపు 40 మందికి చికిత్స అందిస్తున్నారు. ఢాకాలోని బెయిలీ రోడ్డులో ఉన్న పాపులర్ బిర్యానీ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా అగ్ని కీలలు ఎగసినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మహమ్మద్ షిహబ్ తెలిపారు. చాలా వేగంగా మంటలు భవనంలోని పై అంతస్తులకు వ్యాపించడంతో వాటిలో ఉన్నవారు అగ్ని

కీలల్లో చిక్కుకున్నారు. ప్రమాదం జరిగిన రెండు గంటల్లోనే అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పింది. సుమారు 75 మందిని రక్షించారు. ఢాకాలోని బెయిలీ రోడ్డులో ఎక్కువ శాతం రస్టారెంట్లు, క్లాతింగ్, మొబైల్ ఫోన్ షాపులు ఉన్నాయి. కచ్చి భాయ్ అనే రెస్టారెంట్‌లో ప్రమాదం జరిగింది. మొదటి అంతస్తులో మంటలు అంటుకున్నాయి. అయితే పై అంతస్తుల్లో ఉన్న వారు కిందికి దూకడం, ఊపిరి ఆడకపోవడం వల్ల మరణించారు.

పుతిన్ 'అణు' వ్యాఖ్యలపై అమెరికా ఆందోళన

వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధంలో పశ్చిమ దేశాలు అతిగా జోక్యం చేసుకుంటే... అది అణు సంక్షోభానికి దారితీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన హెచ్చరికలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. 'పుతిన్ నుంచి ఇలాంటి బాధ్యత లేని మాటలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఒక అణ్వాయుధ దేశాధినేత ఇలా మాట్లాడటం సరికాదు. వాటిని వాడటం వల్ల ఎదురయ్యే పరిణామాల గురించి ఇప్పటికే అనేక సార్లు రష్యాకు వెల్లడించాం. ఆ దేశం యుద్ధంలో వాటిని వాడటానికి సిద్ధమవుతోందన్న సూచనలు మాత్రం లేవు' అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మీడియాతో అన్నారు. వచ్చే నెల అధ్యక్ష ఎన్నికలకు వెళ్లనున్న తరుణంలో పుతిన్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ "పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌కు బలగాలను తరలించాలనుకోవడం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. వారి భూభాగాల్లోని లక్ష్యాలనూ ఛేదించగల ఆయుధాలు మా వద్ద ఉన్నాయి. ఆ దేశాల నాయకులు ఇప్పటివరకు ఎటువంటి కఠినమైన సవాళ్లను ఎదుర్కోలేదు. యుద్ధం అంటే ఏంటో వారు మర్చిపోయారు" అని విరుచుకుపడ్డారు. ఈ సందర్భగా అణు హెచ్చరిక చేశారు.

కులం, మతం పేరిట ఓట్లడగవద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేయవద్దని పేర్కొంది. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు లేదా మరేదైనా ప్రార్థనా స్థలాన్ని ఎన్నికల ప్రచారానికి లేదా ఎన్నికల పనులకు ఉపయోగించరాదని... ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లయితే సదరు పార్టీలు, అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లపై గతంలో అవలంబించిన పద్ధతికి బదులుగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇక గతంలో నోటీసులు అందుకున్న స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన పునరావృతం చేస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటాయాని ఈసీ స్పష్టం చేసింది. బహిరంగ ప్రచారంలో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులపై ముఖ్యంగా గతంలో నోటీసులు జారీ చేసిన వారిపై పార్టీలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, అదనపు బాధ్యత వహించాలని ఈసీ హెచ్చరించింది. ప్రజా సమస్యల ఆధారిత చర్చకు ఎన్నికల ప్రచార స్థాయిని పెంచాలని పార్టీలను కోరింది. పార్టీలు, వాటి నాయకులు వాస్తవ ఆధారం లేకుండా ప్రకటనలు చేయరాదని లేదా ఓటర్లను తప్పుదారి పట్టించరాదని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో ప్రత్యర్థులను దూషించే లేదా అవమానించే పోస్టులు, చెడు అభిరుచి లేదా ఇతరుల గౌరవాన్ని కించపర్చే పోస్టులు చేయడం లేదా ఇతరులతో పంచుకోవడం వంటివి చేయరాదని కూడా ఈసీ హెచ్చరించింది. ఈ నెలాఖరులో లోక్‌సభతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుందని భావిస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ఈ సూచన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ పార్టీలు విభజన, వ్యక్తిగత దాడులకు బదులుగా నైతికత, గౌరవప్రదమైన రాజకీయ ప్రసంగాలను ప్రోత్సహించాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఇటీవల పేర్కొన్నారు. తాజాగా ఈసీ చేసిన హెచ్చరిక రాజకీయ చర్చకు వేదికను సిద్ధం చేసినట్లయింది. 2024 సార్వత్రిక ఎన్నికలలో అయోమయాన్ని తగ్గించింది.

ఉద్ధవ్ పార్టీకి 20...కాంగ్రెస్‌కు 18

(మొదటిపేజీ తరువాయి)

చేరిన వంచిత్ బహుజన్ అఘాడీ పార్టీ రెండు చోట్ల బరిలోకి దిగనుంది. రాజు శెట్టి స్వాభిమాని పక్ష పార్టీకి ఒక సీటు దక్కినట్లు తెలిసింది. మహారాష్ట్ర లోక్‌సభ సీట్లలో విజయం తమకు ముఖ్యం తప్ప పార్టీ పోటీ చేసే స్థానాల గురించి కాదని శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడి, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే తమ ఉద్దేశమని మరో నేత ప్రకాశ్ అంబేద్కర్ అభిప్రాయ పడ్డారు.

టీడీపీ నేతలపై అక్రమ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

గురిచేస్తున్నారని, ప్రతిపక్షాలను వేధించేందుకు ఆయుధంగా ప్రభుత్వం వ్యవస్థలను వాడుకుంటోందని లేఖలో పేర్కొన్నారు. అధికార పార్టీకి విధేయుడైన చిలకల రాజేశ్వరరెడ్డిని ఆ సంస్థకు ప్రత్యేక కమిషనర్‌గా నియమించుకొని టీడీపీ నేతలను టార్గెట్ చేస్తున్నారని చంద్రబాబు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కూడా ఈ విభాగం ద్వారా కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారని, మళ్లీ ఇప్పుడు ప్రత్తిపాటి కుమారుడు శరత్‌ను కేసులో ఇరికించి అరెస్టు చేశారని తెలిపారు. శరత్ ఆ సంస్థలో కేవలం 68 రోజులు మాత్రమే అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కేవలం టీడీపీ నేతలను వేధించడమే ఏపీఎస్‌డీఆర్ఐ పనిగా పెట్టుకుందని, దీని వేధింపులు భరించలేక కొందరు వ్యాపార వేత్తలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని గుర్తు చేశారు. సీఐడీని జేబు సంస్థగా మార్చుకుని ఇప్పటికే ప్రత్యర్థి పార్టీ నేతలపై పెద్దఎత్తున కేసులు పెట్టి వేధిస్తోంది. ఇప్పుడు మళ్లీ కొత్తగా ఏపీఎస్‌డీఆర్ఐ ద్వారా ప్రత్యర్థులను ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపరిచే కుట్ర చేస్తోంది. ఇలాంటి చట్టవ్యతిరేక పనులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. అధికారం దుర్వినియోగం చేసే ప్రభుత్వ చర్యను నిలువరించాలని చంద్రబాబు గవర్నర్‌ను కోరారు.

ఇంటర్ పరీక్షకు నిమిషం నిబంధన సడలింపు

విశాలాంధ్ర-హైదరాబాద్ : తెలంగాణ ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన కారణంగా కొందరు విద్యార్థులు పరీక్షలు రాయలేకపోతున్నారు. దీంతో ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఆ నిబంధనను సడలించింది. ఉదయం 9 గంటల తర్వాత 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని నిర్ణయించింది. అయితే నిర్దిష్ట కారణాలతో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా చేరుకునే వారిని 5 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో అనుమతించాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఇంటర్ బోర్డు సూచించింది.

ఏపీకి ప్రత్యేక హోదా

(మొదటిపేజీ తరువాయి)

కాదన్నారు. ప్రత్యేక హోదా కావాలంటే కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావాలన్నారు. వైఎస్ షర్మిలారెడ్డి అధ్వర్యంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పునరుజ్జీవం వస్తుందని సచిన్ పైలట్ దీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు ఇవ్వడం లేదన్నారు. కేంద్రం నిధుల కోసం కేరళ, కర్నాటక ప్రభుత్వాలు ఢిల్లీలో పోరాటం చేశాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్, సైకిల్‌ను ఊరి బయటకు పంపాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో వెంకన్న సాక్షిగా మోదీ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని విస్మరించారన్నారు. అందుకే మోదీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉత్సాహం పెరిగిందన్నారు. 'ఇండియా కూటమి' తో మోదీ, జగన్, చంద్రబాబును తరిమికొడతామన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా వచ్చే అవకాశమే లేదన్నారు. హోదా విషయం తెలియదని అబద్ధాలు చెప్పే ప్రధాని నరేంద్ర మోదీ అదే పార్టీ నేత అయిన వెంకయ్య నాయుడును అడిగి హామీ గుర్తు

చేసుకోవాలన్నారు. అవసరానికి వేషాలు వేసే మోదీ... ఆ మోదీ కాళ్లు పట్టుకుని వేలాడే జగన్, చంద్రబాబు నాయుడు పిరికి రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి పిరికివాళ్ల వల్ల ప్రజలకు మేలు కన్నా కీడే ఎక్కువ జరుగుతుందన్నారు. మట్టి, నీళ్లు మనకు పోసి, దత్త పుత్రులు 29 మందికి వేల కోట్ల రాయితీలు, రుణ మాఫీ చేసి లబ్ధి చేకూర్చే పనులను చేశారన్నారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కడుపులో పుట్టి పిరికిలా బతుకుతున్న జగన్ రాజకీయాలు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. తెలుగువారి ఆత్మ గౌరవం కాపాడిన ఎన్టీఆర్‌కు, ప్రాజెక్టులు తెచ్చి ధీరో దత్త పాలన చేసిన వైఎస్‌కు ద్రోహం చేసిన చంద్రబాబు, జగన్‌ను నమ్మొద్దని ప్రజలకు నారాయణ విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమిని ప్రజలు ఆదరించాలని నారాయణ కోరారు.

ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మాట్లాడుతూ 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అని ఇదే మైదానంలో 2014లో జరిగిన సభలో మోదీ తిరుమల వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక మూడు నామాల స్వామి అయిన తిరుమల వెంకన్నకే పంగనామాలు పెట్టారని ఆమె విమర్శించారు. రామ భక్తుడిని అని చెప్పుకునే మోదీ ఇలా మాట తప్పడం న్యాయమా అని అమె ప్రశ్నించారు. మోదీ ఓట్ల కోసం... రాజకీయం కోసం ప్రత్యేక హోదా అంటూ నాటకం ఆడారన్నారు. పదేళ్లుగా ప్రధాన మంత్రిగా ఉన్న మోదీ ఎందుకు ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. ఢిల్లీని మించిన రాజధాని... ప్రత్యేక రైల్వే జోన్లు...కడపలో స్టీల్ ప్లాంటు... దుగ్గిరాజుపట్నం ఓడరేవు... విశాఖ-చెన్నై కారిడార్... రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పిన మోదీ... అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. పదేళ్లుగా ఈ హామీలు అమలు చేయలేదన్నారు. ఇక చంద్రబాబు సింగపూర్ లాంటి రాజధాని కడతామని మాట తప్పారన్నారు. జగనన్న అయితే మూడు రాజధానులు అంటూ కనీసం ఒక్క రాజధాని కట్టలేదన్నారు. జగనన్న కారణంగా ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా మారిపోయిందన్నారు. పాలకుల తీరుతో దక్షిణ భారతదేశంలోనే మెట్రో సిటీ లేని రాష్ట్రంగా ఏపీ ఉండటం బాధాకరమన్నారు. ఏపీలో పాలకపక్షం, ప్రతిపక్షం ఇద్దరూ కలసి మోదీ మీద త్రిముఖ ప్రేమలో పడ్డారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. అందుకే మోదీని ఎదిరించకుండా ఆయన కాళ్ల వద్ద సాగిలా పడుతున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. ప్రత్యేక హోదాతో ఉత్తరాఖండ్‌లో 2 వేలు, హిమాచల్ ప్రదేశ్‌లో 10 వేల పరిశ్రమలు వచ్చాయని షర్మిల ఈ సందర్భంగా గుర్తు చేశారు. జగన్ మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండరు విడుదల చేస్తామని మాట తప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పాలని షర్మిల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీ రామచంద్రరావు, జేడీ శీలం, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, చింతామోహన్, కనుమూరి బాపిరాజు, డాక్టర్ బత్తెయ్యనాయుడు, వేణుగోపాల్, సీపీఐ నేతలు ఎ.రామానాయుడు, పి.మురళి, రాధాకృష్ణ, చిన్నం పెంచలయ్య, శ్రీరాములు, జనమాల గురవయ్య, సీపీఎం నేత గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కర్కశం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ప్రత్యేక హోదా వస్తే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తనకు 25 ఎంపీలు ఇవ్వండి కేంద్రం మేడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని ప్రగల్భాలు పలికిన జగన్, అధికారంలోకి వచ్చాక కేసుల భయంతో కేంద్రం ముందు సాగిలపడి రాష్ట్ర ప్రయోజనాల కంటే తన వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని తేల్చేశారని మండిపడ్డారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడపకు స్టీలు ఫ్యాక్టరీ, విశాఖకు రైల్వే జోన్ , గిరిజన , మైనింగ్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేయాలని , రాజధానికి , పోలవరం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, డిమాండు చేశారు. ఇప్పటికైనా పాలక పార్టీ నాయకులు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని, అలాగాకుండా పోలీసులను అడ్డం పెట్టుకుని ఉద్యమాలు అణచి వేయాలని చూస్తే రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడతామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి జాన్సన్ బాబు, కె.శివారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, కే కార్తీక్, గాడి అజయ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాసర్‌జీ, సాయికుమార్, రాజేంద్రలను అరెస్టు చేసి గవర్నర్ పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్‌లలో ఉంచారు. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో ఐ.ఆంజనేయులు, ఎన్.వెంకటేశ్వర్లు, బంకా శివకృష్ణ, ఆకుల జనర్ధాన్, శీరం రవికుఆమర్, వియ్యపు దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

అరెస్టు అయిన వారిని పరామర్శించిన సీపీఐ నేతలు

చలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కార్యక్రమంలో అరెస్టై గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌తో పాటు ఇతర పోలీస్‌స్టేషన్‌లలో ఉన్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, ఏఐవైఎఫ్ నాయకులు గుంజా క్రాంతి పరామర్శించి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

తాడేపల్లి వద్ద చలసాని శ్రీనివాస్, లక్ష్మీనారాయణ అరెస్ట్

మరోవైపు మంగళగిరి నుంచి సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పోతినవెంకట రామారావు తదితరులు కలిసి బయలుదేరారు. సీఎం క్యాంప్ కార్యాలయం వెనుక వైపు నుంచి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీమ్ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, పెట్రోలియం ఉత్పత్తులపై ఏపీ వాటా తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ప్లకార్డులు చేతపట్టి ర్యాలీగా వెళ్లిన నేతలను పోలీసులు అరెస్ట్ చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా.. హోదాతోపాటు కనీసం విభజన అంశాలు కూడా ఏ ఒక్కటీ సాధించలేకపోయారని లక్ష్మీనారాయణ మండిపడ్డారు. ఎక్కువమంది ఎంపీలను గెలిపిస్తే హోదా సాధిస్తానని చెప్పిన జగన్, దానిని సాధించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా హోదా సాధన కోసం అఖిలపక్షం వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎండలే ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

శుక్రవారం తెలిపింది. ఈశాన్య ద్వీపకల్ప భారతదేశం... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశాలోని అనేక ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వేడిమి రోజులను అంచనా వేసినట్లు వివరించింది. మార్చిలో దేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాల సగటు 29.9 మి.మీలో 117 శాతం కంటే ఎక్కువ) నమోదయ్యే అవకాశం ఉంది. మార్చి నుంచి మే మధ్య కాలంలో దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహపాత్ర విలేకరుల సమావేశంలో తెలిపారు. మార్చిలో ఉత్తర, మధ్య భారతదేశంలో వడగాలుల పరిస్థితులు ఉండవని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉన్న ఎల్ నినో పరిస్థితులు మధ్య పసిఫిక్ మహాసముద్రంలో నీటి ఆవర్తన వేడెక్కడం, వేసవి కాలం వరకు కొనసాగుతుందని, తటస్థ పరిస్థితులు ఆ తర్వాత అభివృద్ధి చెందే అవకాశం ఉందని మహపాత్ర చెప్పారు. లా నినా పరిస్థితులు... సాధారణంగా భారతదేశంలో మంచి రుతుపవన వర్షపాతంతో సంబంధం కలిగి ఉంటాయి. రుతుపవన కాలం రెండవ సగం నాటికి ఏర్పడే అవకాశం ఉంది. ఇదిలాఉండగా, ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అధికారి(రిటైర్డ్) ఏఎండీ ఇంతియాజ్‌ను నియమించారు. మంగళగిరి ఇన్‌చార్జిగా మురుగుడు లావణ్యకు పార్టీ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యులుగా, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా నాలుగేళ్లపాటు విజయసాయిరెడ్డికి రాజ్యసభ పదవీకాలం ఉన్నప్పటికీ... అనూహ్య పరిణామాల దృష్ట్యా ఆయనను నెల్లూరు పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించారు. ఇంతకుముందు నెల్లూరు పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీకి రాజీనామా చేసి, టీడీపీలో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆయన టీడీపీ నుంచి నెల్లూరు ఎంపీగా పోటీ చేసే అవకాశాలున్నాయి. దీంతో వేమిరెడ్డి స్థానంలో బలమైన అభ్యర్థి కోసం ముగ్గురు పేర్లను అధిష్ఠానం ప్రతిపాదించింది. ఒకానొక దశలో విజయసాయిరెడ్డి బంధువు శరత్ చంద్రారెడ్డిని బరిలో దించాలని వైసీపీ ఆలోచించినప్పటికీ దానిపై సానుకూలత రాకపోవడంతో విరమించుకుంది. ఆర్థికంగా పలుకుబడి గల వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఢీకొట్టాలంటే అదే స్థాయి, అదే సామాజిక వర్గానికి చెందిన నేతకు బాధ్యతలు ఇవ్వాలని వైసీపీ నిర్ణయించింది. దీంతో వ్యూహాత్మకంగా విజయసాయిరెడ్డి పేరును ప్రతిపాదించింది. తొలిసారిగా ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారు. కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జిపైనా ఉత్కంఠకు వైసీపీ తెరదించింది. కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను తప్పించి, ఆయన స్థానంలో ఇంతియాజ్‌ను నియమించారు. ఇటీవల ఇంతియాజ్ వీఆర్ఎస్ తీసుకుని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమక్షాన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా, మంగళగిరి ఇన్‌చార్జిని మళ్లీ మార్పు చేశారు. ప్రస్తుత ఇన్‌చార్జిగా ఉన్న గంజి చిరంజీవిని తప్పించి... ఆయన స్థానంలో మురుగుడు లావణ్యను ప్రకటించారు. ఈమె వైసీపీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు. అంతకుముందు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)ని తప్పించి, బీసీ సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవి నియమించారు. మంగళగిరి నుంచి టీడీపీ నేత నారా లోకేశ్ తిరిగి పోటీకి సిద్ధమవ్వడంతో అక్కడ గెలుపే లక్ష్యంగా బీసీ చేనేత వర్గానికి చెందిన మహిళ మురుగుడు లావణ్యను బరిలో దించారు. లావణ్యను నియమించే ముందు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, వైసీపీ నేతలు గంజి చిరంజీవి, కాండ్రు కమల తదితర ముఖ్యనేతలతో సీఎం జగన్ చర్చించారు. అందరి ఆమోదం అనంతరం మురుగుడు లావణ్య పేరు వెల్లడించారు. ఇప్పటివరకు వైసీపీ తొమ్మిది జాబితాలను విడుదల చేసింది. ఇందులో కొన్ని అసెంబ్లీ స్థానాల ఇన్‌చార్జిలను మళ్లీ మార్పులు, చేర్పులు చేసింది. వైసీపీలోకి తాజాగా జనసేన, టీడీపీ నుంచి చేరికలు ఉండగంతో రాబోయే జాబితాల్లో కొన్ని మార్పులు, చేర్పులకు అవకాశముంది.

యుద్ధం చేస్తున్నా

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ విద్యా దీవెన పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 9.45 లక్షల మంది విద్యార్థుల్లో 93 శాతం మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. తరతరాల పేదరికం సంకెళ్లను తెంపేసి... చదువులనే సంపదతో పెద్ద చదువుల పునాదుల మీద ఆకాశమే హద్దుగా పేదింటి పిల్లలు ఎదిగేందుకు ఉపయోగపడే కార్యక్రమాలు మన ప్రభుత్వం చేపట్టిందని చెబుతూ వివిధ పథకాల గురించి వివరించారు. ఎక్కువ మంది పేద పిల్లలను చదివించాలి, వారు బాగుపడాలి, ఏ పేదవాడూ తన పిల్లల చదువుల కోసం అప్పులపాలయ్యే పరిస్థితి రాకూడదని అర్హత ప్రమాణాలను, ఆదాయ పరిమితిని పెంచామన్నారు. గతంలో లక్ష రూపాయలకు పరిమితమైన ఆదాయ పరిమితిని ఎస్సీలకు 2 లక్షల దాకా పరిమితమై ఉండేదని, మనం వచ్చిన తర్వాత ఏకంగా 2.5 లక్షలకు పెంచి...ఈరోజు 93 శాతం మందికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా మంచి చేయగలిగామన్నారు. పిల్లల చదువుల కోసం ఏ తల్లిదండ్రులూ ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని, పూర్తి ఫీజు చెల్లించే కార్యక్రమాన్ని భుజస్కంధాలపై వేసుకున్నామన్నారు. ప్రాథమికస్థాయి నుంచి పెద్ద చదువుల వరకు విద్యారంగంలో వివిధ పథకాల మీద గత 57 నెలల కాలంలో మనందరి ప్రభుత్వం విద్యా పథకాల మీదనే రూ.73 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఇది పేద, మధ్య తరగతి కుటుంబాల మెరుగైన జీవితం కోసం మనం చేసిన హ్యూమన్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్(మానవ మూలధన పెట్టుబడి) అన్నారు. పేద కుటుంబాల్లో ప్రతి పాపా, ప్రతి బాబూ గొప్ప చదువులతో గొప్ప డిగ్రీలతో ఇంజనీర్లుగానూ, కలెక్టర్లుగానూ, డాక్టర్లుగానూ, పెద్ద పెద్ద కంపెనీల్లో సీఈవోలుగానూ పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలని, ఆ కుటుంబాల తలరాతలన్నీ మారాలని, భవిష్యత్ బాగుండాలని అడుగులు వేస్తూ వచ్చామన్నారు.

నాడు-నేడు కార్యక్రమం ద్వారా 45 వేల ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే విధంగా అభివృద్ధి చేశామని, ప్రపంచ అత్యుత్తమ యూనివర్సిటీల నుంచి 2వేల ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం వలన ఐక్యరాజ్యసమితిలో మన విద్యార్థులకు మాట్లాడే అవకాశం వచ్చిందని, విదేశీ యూనివర్సిటీల్లో చదివే వారికి కోటి 25 లక్షల వరకు ప్రభుత్వం భరిస్తుందని సీఎం వివరించారు. ప్రపంచంతో మన విద్యార్థులు పోటీ పడేలా విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల అమలు కోసం పెత్తందార్లతో యుద్ధం చేయాల్సి వచ్చిందని, వీటన్నింటినీ అర్థం చేసుకుని మంచి జరిగిందని భావిస్తే తనకు అండగా నిలవాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, జోగి రమేశ్, ఉన్నత విద్యాశాఖ చైర్మన్ హేమచంద్రారెడ్డి, స్థానిక శాసనసభ్యుడు కైలా అనిల్ కుమార్, మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేస్తే మళ్లీ కష్టాలే

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. మరలా ఇదే ప్రభుత్వం వస్తే అన్నీ కష్టాలేనన్నారు. సాధారణంగా హత్య కేసుల్లో ఎవరు చేశారనేది నాలుగైదు రోజుల్లో నిర్ధారణకు వస్తారని, తన తండ్రి హత్య కేసులో మాత్రం ఐదేళ్లయినా ఎందుకు తెలియడం లేదో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన పోటీ చేశారని, సొంతవాళ్లే మోసం చేయడంతో వివేకా ఓడిపోయారన్నారు. అయినా నిరాశ చెందకుండా మరింత చురుగ్గా పనిచేశారని చెప్పారు. ఎంత ప్రయత్నించినా ఆయన్ను అణగదొక్కలేకపోతున్నామనే భయం ప్రత్యర్థుల్లో ఎక్కువైందని, అది హత్య వరకు వెళ్లిందని సునీత వివరించారు. హత్య తర్వాత మార్చి 15, 2019న మార్చురీ బయట అవినాశ్‌రెడ్డి తన వద్దకు వచ్చారని, రాత్రి 11.30 గంటల వరకు పెదనాన్న తన కోసం ఎన్నికల ప్రచారం చేశారని చెప్పారన్నారు. సినిమాల్లో చూపించే విధంగా హంతకులు మన మధ్యే ఉంటే గమనించలేకపోయామన్నారు. వివేకాను చంపిన వారిని వదిలిపెడితే ఏం సందేశం వెళ్తుంది? సీబీఐ దర్యాప్తు ఎందుకు త్వరగా పూర్తికావట్లేదు? నాన్నను గొడ్డలితో చంపారనే విషయం జగనన్నకు ఎలా తెలుసు? అని ఆమె ప్రశ్నలు సంధించారు. నాన్న హత్య కేసులో భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉందని, వాళ్లిద్దరినీ జగన్ రక్షిస్తున్నారన్నారు. అవినాశ్‌రెడ్డికి శిక్ష పడాలి...పడుతుంది కూడా. ఎందుకంటే వారు వంచన, మోసానికి పాల్పడ్డారని ఆమె మండిపడ్డారు. ఇచ్చిన మాట మీద నిలబడతా. విశ్వసనీయత అంటూ జగన్ పదేపదే చెబుతున్నారని, కానీ ఈ చెల్లికి ఇచ్చిన మాట ఎందుకు విస్మరించారో సమాధానం చెప్పాలన్నారు. సొంత వాళ్లను అంత సులువుగా అనుమానించలేమని, అందుకే జగన్‌ను కలిసినప్పుడు తనకు ఆయనపై మొదట అనుమానం రాలేదన్నారు. ఒక్కో వాస్తవం బయటకు వస్తుంటే నమ్మాల్సి వచ్చిందని చెప్పారు. ఈ హత్య కేసులో 8 మంది పేర్లు బయటకు వచ్చాయని, ఇంకా రాని పేర్లు చాలా ఉన్నాయన్నారు. జగన్ పాత్రపైనా విచారణ చేయాలని, నిర్దోషి అయితే వదిలేయాలని చెప్పారు. శివశంకర్‌రెడ్డి అరెస్టు తర్వాత కేసు మొత్తం మారిపోయి, వారిలో భయం మొదలైందన్నారు. అప్పటి నుంచే సీబీఐపై కేసులు పెట్టడం ప్రారంభించారన్నారు. సిబ్బందిపై కేసుల తర్వాత కడప నుంచి సీబీఐ అధికారులు వెళ్లిపోయారని, కేసు హైదరాబాద్‌కు బదిలీ అయ్యాకే విచారణ మళ్లీ ప్రారంభమైందని సునీత వివరించారు. అవినాశ్ అరెస్టు కోసం సీబీఐ అధికారులు కర్నూలు వెళ్లినపుడు అక్కడ ఏం జరిగిందో అందరికీ తెలుసని, అరెస్టు చేయడానికి సీబీఐ వెళ్లి వెనక్కి వచ్చిన సందర్భం ఎప్పుడైనా ఉందా అని ప్రశ్నించారు. జగనన్న కేసుల వల్లే నాన్న హత్య కేసును సాగదీస్తున్నారన్నారు. సీబీఐపై ఎలాంటి ఒత్తిళ్లు ఉన్నాయో తనకు తెలియదన్నారు.

అనుమానితులుగానే తనను, తన భర్తను ప్రశ్నించారని, ప్రభుత్వం వెనుక ఉంది కాబట్టే తమపై కేసులు పెట్టారన్నారు. తాను ప్రజల్లోకి వెళ్తానని, ఎలా వెళ్లాలనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఎవరికైనా ఉంటుందని, తాను పోటీ చేయాలా? వద్దా? అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సునీతారెడ్డి తెలిపారు. ఈ కేసులో తనకు షర్మిల మొదటినుంచి అండగా నిలబడిందని, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఎంపీ రఘురామ కృష్ణరాజులకు సునీత ధన్యవాదాలు తెలిపారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేనలను ఓడించాలి
జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, రైతాంగాన్ని ప్రోత్సహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ వైపుగా చర్యలు చేపట్టడం లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. సీపీఐ విశాఖ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ వైఖరిని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవడానికి బీజేపీ ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని, చలో దిల్లీ చేస్తున్న రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదన్నారు. రైతులు చేస్తున్న ఆందోళన నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఎరువులపై సబ్సిడీ ప్రకటించారని గుర్తు చేశారు. కార్పొరేట్ కంపెనీలకు లక్షలాది రూపాయల రాయితీలు ప్రకటిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి విశ్వప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెట్టిందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వైసీపీ, టీడీపీ, జనసేనలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్కే రెహమాన్, జి.రాంబాబు, సీఎన్ క్షేత్రపాల్ తదితరులతో పాటు జిల్లా సమితి సభ్యులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏపీలో ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రారంభం కాగా, ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం నుంచి కొనసాగుతాయి. ఈనెల 20 వరకు పరీక్షలను నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు 10,52,221 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 4,73,058 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 5,79,163 మంది ఉన్నారు. 1,559 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో 57 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్‌తోపాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి 8.45 గంటలకు ఉండాలన్న నిబంధన విధించారు. దివ్యాంగ విద్యార్థులకు గ్రౌండ్ ఫ్లోర్లలో సెంటర్లను కేటాయించడంతోపాటు వారికి గంటపాటు అదనపు సమయాన్ని పరీక్ష రాసే సహాయకులకు అవకాశం కల్పించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు 147 ఫ్లయింగ్ స్క్వాడ్లను, 60 సిట్టింగ్ స్క్వాడ్లను ఇంటర్ బోర్డు నియమించింది. వారితోపాటు జిల్లాకు ఇద్దరు అధికారులను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే ప్రతి గదిలోనూ రాష్ట్ర వ్యాప్తంగా 22వేల సీసీ కెమేరాలతో నిఘా ఉంచారు. పరీక్షల సరళి పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాలోనూ కంట్రోల్ గదిని ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదుల కోసం తాడేపల్లి ఇంటర్ విద్యా కార్యాలయంలో 08645 277707 టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేశారు. పరీక్షా పేపర్లకు మూడుస్థాయిల్లో క్యూఆర్ కోడ్‌ను బోర్డు జోడించింది. పేపర్ ఎక్కడ ఫొటో తీసినా, స్కాన్ చేసినా వెంటనే తెలిసిపోయేలా చర్యలు తీసుకున్నారు. మొదటి సంవత్సర జనరల్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 4,67,002 మంది. ఒకేషనల్స్‌కు 39,003 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వైసీపీలోకి జనసేన, టీడీపీ నేతలు

హరిరామ జోగయ్య కుమారుడు సూర్యప్రకాశ్, కడప నేత సతీశ్ రెడ్డిని ఆహ్వానించిన జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. టీడీపీ, జనసేన పొత్తుపై వ్యతిరేకత చూపినవారు, తొలి జాబితాలో సీట్లు దక్కని వారు అసంతృప్తితో ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు, జనసేన పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (పీఏసీ) సభ్యుడు చేగొండి సూర్యప్రకాశ్‌కు సీఎం జగన్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కడప జిల్లా పులివెందులకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డికి సీఎం వైసీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటు కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామ్ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి, కాపు సంఘం నేత చేగొండి హరిరామ జోగయ్య కుమారుడు చేగొండి సూర్యప్రకాశ్ కొంత కాలంగా టీడీపీ, జనసేన పొత్తుల్లో జనసేన సీట్లు తీసుకునే అంశంపైన, పవర్ షేరింగ్‌పైన జనసేన నాయకుడు పవన్ కల్యాణ్‌కు హరిరామ జోగయ్య వరుసగా లేఖలు రాశారు. జనసేన బలోపేతానికి ఆయన సూచనలిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ, జనసేన పొత్తుల్లో భాగంగా జనసేనకు 24 సీట్లు ఇవ్వడంపై ఆ పార్టీ శ్రేణులు, కాపు సంఘం నేతలు అసంతృప్తిగా ఉన్నారు. తాడేపల్లిగూడెం జెండా పండుగ సభలో తనకు ఎవరి సలహాలు అవసరం లేదంటూ హరిరామ జోగయ్యను ఉద్దేశించి పవన్ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. దీనిపై మళ్లీ హరిరామ జోగయ్య స్పందిస్తూ, తమ సలహాలు తీసుకోకుంటే వారి ఖర్మ అంటూ లేఖ రాశారు. ఇలా లేఖాస్త్రాలతో నిత్యం పవన్‌ను ఇరకాటంలో జోగయ్య పెడుతున్నారు. పవన్‌కు మరో కాపు సంఘం సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం లేఖ రాసి పొత్తులతో జనసేనకు వచ్చిన సీట్లపై అసంతృప్తిని వెళ్లగక్కారు. కనీసం 80 సీట్లు, పవర్ షేరింగ్ తీసుకుంటే బాగుండేదని సూచించారు. ఈ రాజకీయ పరిణామాలతోపాటు తొలి జాబితాలో సీటు దక్కకపోవడంపై చేగొండి సూర్యప్రకాశ్ అసంతృప్తిగా ఉన్నారు. వైసీపీ ఆకర్ష్‌లో భాగంగా కొందరు పార్టీ ముఖ్యనేతలు జరిపిన చర్చలతో ఆయన వైసీపీలో చేరేందుకు వచ్చారు. అనంతరం మీడియాతో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఏకపక్ష వైఖరిని తూర్పారబట్టారు.

బీజేపీ, వైసీపీలను సాగనంపండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-రాజోలు: రాబోయే ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీ, వైసీపీని సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. మలికిపురంలో నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగిన సీపీఐ రాజోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి డేగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో మతాలు, కులాల మధ్య కుంపటి రాజేసి రాజకీయలబ్ధి పొందాలని, దేశాన్ని అదానీ, అంబానీలకు బీజేపీ తాకట్టు పెట్టిందన్నారు. రైతులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, దళితులు, క్రైస్తవులు, ముస్లింలను అతి కిరాతకంగా చంపేస్తూ, దౌర్జన్యాలు, మానభంగాలు చేస్తున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి అనుసరించడాన్ని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో జగన్ నిరంకుశ పరిపాలన చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులను, పథకాలను, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఒక్క కొత్త పరిశ్రమ కూడా స్థాపించలేదని, మెగా జాబ్ కేలండర్ ఇస్తానని మినీ జాబ్ కేలండర్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేశ్, కె.రామకృష్ణ, గెద్దం ప్రభాకర్ రావు, చెల్లుబోయిన తాతారావు, దేవ సురేష్‌బాబు, మెడిచర్ల సత్యనారాయణ, పుల్లెల ఆనంద్, వై.వెంకట్, ఆకన నాగేశ్వరరావు, డి.చిట్టిబాబు, బత్తుల రవి, ఎడ్ల మనిరావు పాల్గొన్నారు.

భూహక్కుల చట్టం రద్దు చేయాల్సిందే

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పాలకొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం 27/23 భూ కబ్జాదారులకు అనుకూలమైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. దీనిని రద్దు చేసేవరకు ఉద్యమించాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ అయ్యప్ప శంకర్ ఫంక్షన్‌హాల్ లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కుల చట్టం అత్యంత ప్రమాదకరమైందని, దీని రద్దు కోసం న్యాయవాదులు చేస్తున్న ఆందోళన వారి ఒక్కరి కోసమే కాదన్నారు. ఆందోళనను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు రైతులను చైతన్య పరచడంలో రైతు సంఘం నాయకులు, సభ్యులు క్రియాశీలకంగా పనిచేయాలని కోరారు. సీనియర్ న్యాయవాది ఉత్తరావల్లి మురళీమోహన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో 553 సివిల్ కోర్టులు, స్థానిక రెవెన్యూ యంత్రాంగం తీర్చలేని భూ సమస్యలను కేవలం 26 టీఆర్‌ఓలు పరిష్కరించగలరా అని ప్రశ్నించారు. కేవలం భూ బకాసురుల కోసం స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల అజమాయిషీలో మాత్రమే పనిచేసే యంత్రంగా టీఆర్‌ఓలు మారతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రైతులను చైతన్యం చేయడం చాలా అవసరమన్నారు. అందులో భాగంగా శనివారం విజయవాడలో రాష్ట్ర బార్ అసోసియేషన్ సమావేశం జరుగుతుందని అందులో తీసుకున్న నిర్ణయాన్ని బట్టి మా కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు వెలమల సత్యనారాయణ, విజయనగరం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామమూర్తి నాయుడు, గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు, చేబోదల లక్ష్మీనారాయణ (గ్రామ సర్పంచ్ ప్రతినిధి), నాయకులు ఈదువెల్లి సింహాచలం, కనపాక చౌదరి నాయుడు, వండాన కూర్మారావు, పాలవలస రామినాయుడు, బలగ దుర్గారావు, పామోటి వైకుంఠరావు, ఎందవ సూరిబాబు, బలగ లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పటిష్ఠంగా జగనన్న గోరుముద్ద

పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తగిన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని, మంచి ప్రమాణాలతో రూపొందించి అందించేలా జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని మరింత పటిష్టవంతంగా అమలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడ కానూరులోని షామ్రాక్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన జగనన్న గోరుముద్ద-ఆహార అక్షరాస్యత రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం ప్రకారం 'హెల్త్ అండ్ వెల్ నెస్ ఎడ్యుకేషన్'ను పాఠ్యాంశాల్లో భాగం చేయాల్సి ఉందన్నారు. ఈ మేరకు ఆహార అక్షరాస్యతను ఒక పాఠ్యాంశంగా ఎలా చేర్చవచ్చనే అంశంపై ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు విద్యార్థుల్లో సామర్థ్యం పెంచేందుకు ఆహార అక్షారస్యత దోహదం చేస్తుందని వివరించారు. ఇందుకు ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సీఈవో పవన్ అగర్వాల్ ఎంతో సహకరించారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో పాఠ్యాంశాల్లో 'ఆహార అక్షరాస్యత' ను ఒక ప్రత్యేక అంశంగా చేర్చే అంశాన్ని అధ్యయనం చేసి ఫుడ్ ఫ్యూచర్ ఫౌండేషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుందని చెప్పారు. ఆహార అక్షరాస్యత అనేది విద్యార్థులకు చాలా ముఖ్యమైందని, పౌష్టికాహారంపై వారిలో అవగాహన కల్పించడంతో పాటు సమాజంలో కీలక మార్పులు తీసుకొస్తుందన్నారు. అంతకుముందు ఆహార అక్షరాస్యత సాధ్యాసాధ్యాలు, విద్యార్థులకు అవగాహన, ఉపాధ్యాయులకు శిక్షణ, సమన్వయం వంటి తదితర అంశాలపై ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ శోభిక ఎస్ఎస్, పాఠశాల విద్య, సాంఘిక సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ, ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల అధికారులు, పోషకాహార నిపుణులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐల్లో కాంట్రాక్ట్ పోస్టుల భర్తీ

24 వరకు దరఖాస్తుల స్వీకరణ...

మే 6న రాతపరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐ) ఖాళీగా ఉన్న 71 అసిస్టెంట్ ట్రెనింగ్ ఆఫీసర్ (ఏటీఓ) పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ డా.బి.నవ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను ఎంప్లాయిమెంట్ వెబ్ సైట్‌లో ఈనెల 1 నుంచి 20వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 6వ తేదీ రాత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగ అర్హతలు, వయస్సు, ఖాళీల వివరాలు, పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ సంబంధిత వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు వెల్లడించారు.

ముసుగు తొలిగింది

రాజకీయ కుట్రతోనే సునీత వ్యాఖ్యలు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివేకా హత్య కేసులో ఇప్పుడు ముసుగు తొలిగిందని, ఎన్నికల వేళ రాజకీయ కుట్రతోనే దిల్లీలో సునీత మీడియా సమావేశాన్ని నిర్వహించిందని వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, ఆమె మాట్లాడినవన్నీ చంద్రబాబు పలికించిన చిలుకపలుకులేనన్నారు. నాడు వివేకాను ఓడించిన వ్యక్తులకే నేడు సునీత థ్యాంక్స్ చెబుతున్నారని, అన్యాయం జరిగిందని తప్పుడు ఆరోపణలు చేసి జగన్‌ను శిక్షించమనడం విచిత్రంగా ఉందన్నారు. వివేకా హత్యలో ఆమె కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉందేమోనన్న అనుమానాలున్నాయని తెలిపారు. వాటిని తప్పించుకోవడానికి దొంగే... దొంగ దొంగ అన్నట్లు మాట్లాడుతున్నారేమోనని వ్యాఖ్యానించారు. తన తండ్రిని కిరాతకంగా చంపినవాడు సునీతకు మంచోడెలా అయ్యాడు అని ప్రశ్నించారు. సునీత ఎవరి ప్రతినిధిగా మాట్లాడుతున్నారో, ఎవరి ప్రతినిధిగా ఇన్నాళ్లు తప్పుడు కేసు బిల్డ్ చేస్తున్నారో అంతా ఈరోజు బయటపడిందన్నారు. ఆమె మాట్లాడిన దానికంటే ఇందుకు వేరే ఆధారాలు అవసరం లేదని చెప్పారు. ఆమె తన తండ్రి ఎమ్మెల్సీగా ఓడిపోవడానికి వైసీపీనే కారణమని ఆరోపిస్తున్నారని, ఆనాడు 2017లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు 160 పైగా ఓట్లు అధికంగా వైసీపీకి వచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల కోటా కింద వివేకానందరెడ్డి మెజార్టీతో గెలవడానికి కావాల్సినన్ని ఓట్లు పార్టీకి ఉన్నాయని, అందుకోసమే తన చిన్నాన్నను జగన్ అభ్యర్థిగా పెట్టారని చెప్పారు. పవన్ 24 సీట్లు తీసుకుని 240 సీట్లు అనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. చంద్రబాబు పెట్టుకున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ జనసేన అని, తాడేపల్లిగూడెం సభను చూశాక వారిద్దరి పని క్లోజ్ అని అర్థమైందని ఎద్దేవా చేశారు.

కార్మిక నేత సత్యనారాయణ మృతి తీరనిలోటు

ఏఐటీయూసీ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: కార్మిక నాయకుడు కరపాటి సత్యనారాయణ మృతికి ఏఐటీయూసీ రాష్ట్ర సమితి, అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సంతాపం తెలిపాయి. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, మున్సిపల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆసుల రంగనాయకులు పోరుమామిళ్ల సుబ్బరాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేస్తూ, మచిలీపట్నంలో గత 32 సంవత్సరాలుగా కార్మికునిగా పనిచేస్తూ అనారోగ్యంతో తన గృహంలో మరణించారని అన్నారు. మూడు దశాబ్దాలు పైచిలుకు మచిలీపట్నంలోనూ, రాష్ట్రంలోనూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అభివృద్ధికి కార్మికుల పక్షాన వారి హక్కులకై నిరంతరం పోరాటాలు జరిపిన నేత కరపాటి అని పేర్కొన్నారు. ఆయన మరణం మున్సిపల్ సంఘానికి, వ్యక్తిగతంగా తమకు తీరనిలోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతికి నివాళి అర్పిస్తూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మచిలీపట్నం శ్మశానవాటికలో శనివారం సత్య నారాయణ అంత్యక్రియలు జరుగుతాయని, పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని వారు కోరారు.

ఏఏఎస్ ఇంక్రిమెంట్ల నిబంధనల సడలింపుపై ఈయూ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం అనంతరం పదోన్నతులు లేకపోతే, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంటు స్కీమ్ (ఏఏఎస్) కలిపేందుకు యాజమాన్యం నిర్ణయించడంపై ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేస్తూ, ఈయూ రాష్ట్ర కమిటీ చేసిన కృషిమేరకు ఎండీ ద్వారకా తిరుమలరావు సానుకూలంగా నిర్ణయం తీసుకు న్నారని తెలిపారు. పనిచేస్తున్న సిబ్బందికి విలీనానికి ముందు చేపట్టిన ఎంపిక ప్రక్రియ నిబంధనల ఆధారంగా, అప్పుడు ఏ విద్యార్హతలతో నియ మించారో అవే నిబంధనల ప్రకారం వీరికి ఏఏఎస్ ఇంక్రిమెంట్లు కలిపేం దుకు వీలుగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీజేశారని వివరించారు. యాజమాన్యానికి తరపున ధన్యవాదాలు తెలిపారు.

'వీఐటీ' వేదికగా 3, 4 తేదీల్లో

ఉన్నత విద్యా ప్రణాళికా బోర్డు సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల మూడు, నాలుగు తేదీల్లో ఏపీ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఆరవ సమావేశాలకు వీఐటీ విశ్వవిద్యాలయం వేదిక కానుంది. 'విశ్వవిద్యాలయాల్లో వైబ్రెంట్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్'ను పెంపొందించే లక్ష్యంతో ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకోనున్నారు. ఏపీ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డ్ చైర్మన్, ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి ఈ సమావేశాన్ని ప్రారంభించనుండగా, తొలుత వీఐటీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.వి. కోటా రెడ్డి తన సందేశాన్ని అందిస్తారు. అనంతరం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, ఏపీసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, ఏపీసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం, వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ పాల్గొననున్నారు. రాష్ట్రంలో అన్ని కేంద్ర, రాష్ట్ర విశ్వ విద్యాలయాలు, డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు చెందిన వైస్ ఛాన్సలర్లు హాజరవుతున్నారు. థీమ్‌పై ఐదు సెషన్స్‌లతో చర్చలు జరుగుతాయి. వీటి ఆధారంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి విధానపత్రం తయారు చేయబడుతుంది.

ఏయూకు రెండు అంతర్జాతీయ పేటెంట్లు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రెండు అంతర్జాతీయ పేటెంట్లు సాధించింది. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, కె.వెంకటలక్ష్మి 'మెషీన్ లెర్నింగ్' ఆధారితంగా బయో మెడికల్ ఇమేజ్ విశ్లేషణ చేసి ఖచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేసే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ మంజూరైంది. మెషీన్ లెర్నింగ్ సహాయంతో ప్రారంభదశలోనే వ్యాధినిర్ధారణ చేయడం వలన రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించి స్వస్థత చేకూర్చడం సాధ్యపడుతుంది. తొలుత ఇండియాలో పేటెంట్ కార్యాలయం దీన్ని ప్రచురించగా, తాజాగా సౌతాఫ్రికా దేశం పేటెంట్ గ్రాంట్ అందించింది. ఏయూ అంబేద్కర్ చైర్ గత ఆరు నెలలుగా ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల మధ్య ఫీల్డ్ విజిట్ చేసి సేకరించిన డేటాను దీంతో అనుసంధానం చేయడం జరుగుతుంది. ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి, ఇనకోటి రవికుమార్ అత్యంత ప్రాధాన్యత, గోప్యత కలిగిన సమాచారాన్ని నెట్‌వర్క్ ఆధారితంగా పంపే సమయంలో ప్రత్యేకమైన కోడ్‌ను ఉపయోగించి సురక్షితంగా సమాచారాన్ని పంపే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ లభించింది. రక్షణ రంగం, బ్యాంకింగ్ లావాదేవీలు, పరిశ్రమలు, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ ప్రముఖమైన సమాచారాలను పంపడానికి ఈ సాంకేతికత ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. ఏయూ అంబేద్కర్ చైర్ నుంచి తొలిసారిగా రెండు అంతర్జాతీయ పేటెంట్లను సాధించామని రిజిస్ట్రార్, ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ తెలిపారు.

ఎన్నికల సామగ్రి సరఫరాకు టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర-భీమవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు పశ్చిమ గోదావరి జిల్లాలో 1,754 పోలింగ్ స్టేషన్‌లకు ఎన్నికల సామగ్రి సరఫరా చేయడానికి ఆసక్తిగల ఏజెన్సీల నుంచి స్వల్ప వ్యవధి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈనెల 7వతేదీ మధ్య అన్ని పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని కోఆర్డినేషన్ సెక్షన్‌లో టెండర్ ఫారాలు పొందాలన్నారు. సీల్డ్ టెండర్లను ఏడున సాయంత్రం నాలుగు గంటల లోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు కలెక్టర్ ఛాంబర్‌లో టెండర్లు తెరవబడతాయని, ఫైనల్ చేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబు-పవన్ పెద్ద సైకోలు: లక్ష్మీపార్వతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: చంద్రబాబు-పవన్ కల్యాణ్ కంటే పెద్దసైకోలు ఎవరుంటారని, ప్రజల్లో బలంలేని నేతలుగా వీరు ఒంటరిగా మిగిలిపోయారని వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పొత్తుల బేరంలో ఓ వైపు ఇరుపార్టీల కేడర్‌ల ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పుకోలేక మరోవైపు ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన పరిస్థితుల్లో వారు తమ మానసికస్థితిపై పట్టు కోల్పోయినట్లు నోరుపారేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వారి విమర్శలు, ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నానన్నారు. బాబు బ్లాక్‌మెయిలింగ్‌కు పవన్ కీలుబొమ్మగా మారిపోయారన్నారు. పవన్ కల్యాణ్... నీవు చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ కాకపోతే, చంద్రబాబు నీ సమక్షంలోనే జనసేన జెండాల్ని మడిచి పక్కనబెట్టండని అరుస్తుంటే చూస్తూ ఉంటావా అన్నారు. నిజంగా, జనసేన పార్టీని బతికించుకోవడానికి ఆ పార్టీ కార్యకర్తలు చేస్తున్న పోరాటం కూడా పవన్ కల్యాణ్ చేయడంలేదన్నారు. చంద్రబాబు రాజకీయ దిగ్గజం అయితే 23 సీట్లతో ఎందుకు ఓడిపోయాడని లక్ష్మీపార్వతి ప్రశ్నించారు.

సంపాదకీయం

వడివడిగా ఇండియా అడుగులు

ఇండియా కూటమి వడివడిగా అడుగులు వేస్తోంది. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ సీట్ల సర్దుబాటు పూర్తయింది. ఇండియా కూటమి ఏర్పడిన నాటినుంచి దాన్ని చెల్లాచెదురు చేయాలని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా అన్ని రకాల కుట్రలు, కుహకాలు పన్నుతున్నారు. మోదీ ప్రభుత్వం వల్ల ఎదురవుతున్న ఆటంకాలను అధిగమిస్తూ ఇండియా కూటమి కాస్త నెమ్మదిగా, ఆలస్యంగానైనా వడివడిగా ముందడుగు వేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మూలంగా కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు కుదరదని బీజేపీ సంతోషపడింది. రైతు నాయకుడు కీ.శే.చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించి ఆర్‌ఎల్‌డీ పార్టీని మోదీ తమవైపు లాక్కున్నారు. అయితే భారత్‌జోడో న్యాయయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చొరవ తీసుకొని అఖిలేశ్‌తో 17 సీట్లకు అంగీకరించి సర్దుబాటు కుదుర్చుకున్నారు. అనంతరం అఖిలేశ్ రాహుల్ యాత్రలో పాల్గొన్నారు. అప్పటి నుంచి మధ్యప్రదేశ్, బీహార్, తమిళనాడు, కర్నాటక, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర తదితర మెజారిటీ రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు కుదుర్చుకొని దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారసభల నిర్వహణకు పూనుకుంది. ముందుగా బీహార్ రాజధాని పట్నాలో మార్చి 3వతేదీన భారీ బహిరంగసభ నిర్వహించడానికి సిద్ధపడ్డారు. ఈ సభకు ముందు ఆర్‌జేడీ నాయకుడు, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్ రాష్ట్రంలో యాత్ర నిర్వహించి ప్రజలను కలుసుకొని ప్రచారం సాగించారు. మరోసారి పార్టీమారి బీజేపీలో చేరేముందు మహా ఘట్‌బంధన్ పార్టీల నుంచి సమస్య ఎదురైందని ఏనాడు చెప్పలేదన్న వాస్తవాన్ని వెల్లడించి నితీశ్‌కుమార్ అసలురంగు బట్టబయలు చేశారు. తనపర్యటనలో ప్రజాదరణ బాగా ఉందని, నితీష్ వెళ్లిపోవడమే తమ కూటమికి మేలుచేస్తుందని అన్నారు. నితీశ్ పార్టీ మారుతున్నట్టు ప్రకటించిన నాటికి రెండు నెలల ముందే ప్రధాని మోదీ, అమిత్‌షా కుట్రపన్ని ఈ వ్యవహారాన్ని నడిపించినట్టు తెలుస్తోంది. బీజేపీ అధికారానికివచ్చిన నాటి నుంచి ఆయారాం గయారాం కుట్ర విపరీతమై పోయింది. ఇండియా కూటమి ఏర్పడిన నాటి నుంచి దాన్ని చెల్లా చెదురుచేసేందుకు మోదీ, షా చేయని ప్రయత్నంలేదు. నితీశ్ కూటమి నుంచి బైటకు వెళ్లిపోయిన వెంటనే ఇండియా పని అయిపోయిందని బీజేపీ నాయకులు దేశవ్యాప్తంగా ప్రచారం సాగించారు. మోదీ ఆకట్టుకున్న గోదీ మీడియా, దేశమంతటా కోట్లు ఖర్చుచేసి ఏర్పాటు చేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార యంత్రాంగం, సోషల్‌మీడియా ఇండియా కూటమి పని అయిపోయిందని డప్పుకొట్టుకున్నాయి. అయినప్పటికీ మణిపూర్ నుంచి రాహుల్ భారత్ జోడో యాత్ర జరుపుతూ, మోదీ పదేళ్ల పాలనలో సంపన్నుల అభివృద్ధి కోసమే పనిచేస్తూ సామాన్యులను మరింతగా పేదలుగా మారుస్తున్నారన్న వాస్తవాలను ప్రజలకు వివరిస్తున్నారు. న్యాయయాత్ర సాగిన అన్ని ప్రాంతాల్లో రాహుల్‌కు ప్రజలు గొప్పగా స్వాగతం చెప్తూ ఆదరించారు. ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్ పశ్చిమప్రాతంలో రైతులు ఆర్‌ఎల్‌డీతో ఉన్నారనుకున్నప్పటికీ రాహుల్‌ను ఎక్కువగా ఆదరించారు. పంటలకు కనీసమద్దతు ధరకు చట్టం చేయాలని రైతులు మరోసారి పోరాటం చేస్తున్నందున బీజేపీని వ్యతిరేకిస్తున్నారన్న వార్తలు వచ్చాయి. ఇక పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ నాయకురాలు మమతాబెనర్జీని కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు రాహుల్ ఒప్పించగలిగారు. మరోవైపు బెంగాల్ సందేశ్ ఖలీలో టీఎంసీ నాయకుడు మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డాడని, భూములు ఆక్రమించుకున్న వ్యవహారాలపై ఆరెస్టు చేయడంద్వారా వచ్చిన నష్టం తగ్గడానికి మమత సకాలంలో చర్య తీసుకున్నారు. అయితే ఇలాంటి అక్రమాలు చేస్తున్న నాయకులకు బీజేపీలో కొదవ ఏమీలేదు. మహిళా కుస్తీ క్రీడాకారులను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలని చాలాకాలం ఆందోళన చేసినప్పటికీ మోదీ మౌనం పాటించడమే కాదు, క్రీడాకారులను వేధించారు.

ఏ చిన్న అవకాశం లభించినా కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చేందుకు, వీలైతే తగినంతమంది ఎమ్మెల్యేలకు గాలంవేసి వారిని తమ పార్టీలో చేర్చుకుని బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు చేసుకునేందుకు మోదీ,షా ఎల్ల వేళలా సిద్ధంగా ఉంటారు. ఈశాన్య ప్రాంతంలో ఉన్న ఒకే ఒక కాంగ్రెస్ పాలిత రాష్ట్రం హిమాచలప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల సందర్భంగా ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ఓటింగ్ చేయించుకొని ఒక సీటును బీజేపీ గెలుచుకుంది. అంతేకాదు, అక్కడి ప్రభుత్వాన్ని కూల్చి వేసేందుకు బీజేపీ కుట్ర కొనసాగిస్తునే ఉంది. అయితే కాంగ్రెస్ సకాలంలో మేల్కొని తగిన చర్యలు చేపట్టి ప్రస్తుతానికి ప్రభుత్వాన్ని కాపాడుకున్నది. తమకు 370, ఎన్‌డీఏకి 400 సీట్లు వస్తాయని ప్రధాని మోదీ ప్రతిచోట సభల్లో మాట్లాడుతూ ప్రజలతో మైండ్‌గేమ్ ఆడుతున్నారు. కాంగ్రెస్‌కు 40సీట్లు కూడా రాకపోవచ్చునని ప్రచారం సాగిస్తూ నిరుత్సాహపరిచేందుకు మోదీ ఆయన గోదీ మీడియా శాయశక్తులా ప్రయత్నిస్తున్నప్పటికీ కాంగ్రెస్‌తోపాటు ఆప్, ఎన్‌సీపీ, ఆర్‌జేడీ తదితర పార్టీలు మోదీ ప్రభుత్వం కార్మికులకు, కర్షకులకు చేసిన అన్యాయాలను, ఆకాశం అంటుతున్న అన్ని రకాల వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలమైన విషయాలను ప్రజలకు వివరించడంలో ఏ మాత్రం వెనుకాడడం లేదు. గత సంవత్సరం ప్రతిపక్షాల మధ్య సైద్ధాంతిక, భావజాలమైన, వ్యక్తిగతమైన విభేదాలు తలెత్తినప్పటికీ బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ఇండియాకూటమిగా ఇప్పుడు ఒక్కటయ్యాయి. మొదట కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పొరపాటు చేసినప్పటికీ ప్రస్తుతం అన్ని విభేదాలు సర్దుబాటు చేసుకుంది. పొరపాటుతో నష్టపోయిన అంశాన్ని గ్రహించి చకచకా ప్రజలవద్దకు చేరేందుకు పూనుకున్నారు. వీలైనన్ని ఎక్కువ సీట్లతో ఉమ్మడి అభ్యర్థిని బీజేపీపైన పోటీ చేయించేందుకు కూటమి చర్చలు జరపడం మరింత ముందడుగు వేసినట్టవుతుంది. ఒకరిద్దరు వ్యక్తులు కూటమి నుంచి వెళ్లిపోయినప్పటికీ పెద్దగా వచ్చే నష్టం ఉండబోదని విశ్లేషణలు వస్తున్నాయి. పదేళ్లలో ఎంతగానో అభివృద్ధి చేశానని మోదీ సాగించే అసత్యప్రచారాన్ని ప్రజలు గ్రహిస్తున్నారు. అయోధ్యలో రామాలయాన్ని నిర్మించి, బలరాముడికి ప్రాణప్రతిష్ఠ చేసినప్పటికీ, ఎక్కువగా నష్టపోతున్న హిందువులు సక్రమంగా ఆలోచించి ఓట్లువేస్తారని తాజాగా ఆలోచన చేస్తున్నారు. రానున్న రెండు నెలల్లో అవిశ్రాంతంగా ఇండియాకూటమి పార్టీలు ప్రచారం చేయనున్నాయి. సీట్లసర్దుబాటు దాదాపు పూర్తికావచ్చినందున విస్తృతప్రాంతాల్లో మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకు అన్ని తరగతుల ప్రజలు కూటమికి సహకరించాలి. ఉన్నతస్థాయిలో ఉన్న కూటమి నాయకులు తమమధ్యగల విభేదాలను సర్దుబాటు చేసుకుని ప్రచారం చేయాలి. అలాగే రాష్ట్రాల యూనిట్ల మధ్య గల సమస్యలను పరిష్కరించుకోవాలి. 20శాతం ఉన్న ముస్లింలు ఉత్తరప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారన్న సమాచారం కూటమికి ఎంతో ప్రయోజనం. గుజరాత్ లాంటి రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల సర్దుబాటు కుదరడం గొప్ప పరిణామం. మరింత కష్టపడితే ఫలితం సానుకూలం కావచ్చు.

పీకే డ్రాప్

"హరి గారు డ్రాప్‌కి ఎన్ని ఓకులుండాలండి" చాలా వినమ్రంగా కుడి అరచేతిని ఎడమ చెవి కింద రాస్తూ అడిగాడు పీకే. "నువ్వేందయ్యా పీకే. ఆటలో కూర్చున్న దగ్గర నుంచి డ్రాప్ డ్రాప్ అంటావు" ఎనిమిది పదుల వయసు దాటినా ఎలాగైనా పీకేని గెలిపించాలని తాపత్రయ పడుతున్న హరి జోగయ్య కాసింత అసహనంగానే అన్నారు. "హ... హ... నాకు గెలవడం కంటే మా బాబును గెలిపించడంలోనే ఆనందం హరిగారు. అందుకే ఈ సారి కూడా డ్రాప్ అయిపోదామని" చేతిలో ఉన్న కొన్ని కాగితాలని తదేకంగా చూస్తూ అన్నాడు పీకే. హరిగారు పది రోజుల క్రితం పీకేకి 70 మంది పేర్లు రాసి పంపిన ఉత్తరం అది. "నాకు తెలుసు పీకే నీ గురించి. నువ్వు ఏం చేసినా నా కోసరమే చేస్తావ్. నా కోసరమే ఆలోచిస్తావ్. డ్రాప్‌కి ఎన్ని ఓకులుండాలో హరిగార్ని అడిగితే ఎలా. అమాయకుడివి కాకపోతే. నన్ను అడుగు. నే చెప్తా" అన్నారు వీరిద్దరి సంభాషణని దూరం నుంచి వింటున్న బాబు. అప్పుడు సమయం ఉదయం 10 గంటలైంది. మరో గంటన్నరలో ఎక్కడెక్కడ ఎవరెవర్ని రంగంలోకి దించుతున్నారో బాబు, పీకే ప్రపంచానికి ప్రకటిస్తారు. ఇదిగో ఈ ప్రకటన కోసమే అటు పీకేని నమ్ముకున్న సైనికులు, ఇటు "మా బాబే... మా 40 ఏళ్ల అనుభవమున్న నాయకుడే. అబ్బే నన్నే రంగంలోకి దింపుతారు. నా పేరే ప్రకటిస్తారు" అని టీవీల ముందు కుటుంబాలతో సహా అతుక్కుపోయిన తమ్ముళ్లు అనుకుంటున్నారు. అదిగో అలాంటి సమయాన, ఆ అద్భుత ఆనంద వేళ ఈ పేకాట, డ్రాప్‌కి ఎన్ని ఓకులు అంటూ మాట్లాడతారేమిటి అనుకుంటున్నారు అక్కడున్న కొందరు సీనియర్ తమ్ముళ్లు, మరికొందరు సీనియర్ సైనికులు. "తమ్ముడూ పీకే. నీకు డ్రాప్ అంటే ఎంతిష్టమో నాకు తెలుసు. ఆ డ్రాప్‌కి ఉన్న ఓకులు కూడా నీకు చాలా ఇష్టమని నేను ఎప్పుడో గ్రహించాను. ఆట ప్రారంభం కావడానికి ముందే నువ్వు డ్రాప్ అయ్యేలా చేసే బాధ్యత నాది. మీ సైనికులకి నచ్చ చెప్పు. ఏడాదిగా నువ్వు మాట్లాడుతున్నదే మళ్లీ తిరగేసి, మరగేసి చెప్పు. మీ సైనికులకి నీ మీద పిచ్చి ప్రేమ. పైగా వారంతా వీరాభిమానులు. మనం ఇద్దరం కలిసి ఆడితే ఈ ఫుల్ గేమ్ కొట్టేయచ్చు అని వివరించు. రెండు రోజులు లేదా మూడు రోజులు మహా అయితే ఓ వారం అలుగుతారు. ఆగ్రహంగా ఉంటారు. ఇవన్నీ నీకు నేను చెప్పనవసరం లేదు. నీకు తెలుసనుకో" అని గాజు గ్లాసులో పావు వంతు టీ పోస్తూ సైకిలోపదేశం చేశారు బాబు. "హ. హ. అలాగే బాబు గారు. మా సైనికుల గురించి నే చూసుకుంటా. ఇంతకీ నాకు ఎన్ని ఓకులు కేటాయిస్తారు. అంటే డ్రాప్ చేసేందుకు వీలుగా" అన్నారు పీకే. "తమ్ముడూ... నువ్వు ఆ మధ్య గోపాలా గోపాలా సినిమాలో అన్నావు చూడు ఓ మాట నీకు ఎన్ని కావాలో అన్నే ఇస్తాను. అని... అలాగే ఇదీనూ" పైకి వస్తున్న నవ్వుని లోపలికి తోసేస్తూ చెప్పారు బాబు. "హ. హ. మీరేం చెబితే అదే. మీరన్నట్లు మా సైనికులు అభిమానులే కాదు... అమాయకులు కూడా. వాళ్ల సంగతి నాకొదిలేయండి" ఈ సారి కుడిచేత్తో ఎడమ చెవి కింద రాయకుండా.... వెరైటీ కోసం కుడి చేతి వేళ్లతో చాలాకాలంగా కటింగ్‌కు నోచుకోని జుట్టుని వెనక్కి నెడుతూ ఓ అలవికాని ఆనందంతో అన్నారు పీకే. "సరే విషయానికి వద్దాం. ఈసారి నీకు డ్రాప్‌కి అవసరమైన 24 కేటాయిస్తున్నాను. నీకు ఆనందమేగా. సంతోషమేగా" అన్నారు బాబు. "ఆహా మహా ప్రసాదం. అహో, అద్భుతం. ఓహో మీరు అమోఘం. అసలు మీ విజనరీ ముందు ఎవ్వరూ పనికిరారు. తమ్ముడు నాదెండ్లా... నాయనా హరీ... ఆ పాత పాట సరిలేరు నీకెవ్వరూ... ఆంధ్రపాల బాబూ.. సరి లేరు నీకెవ్వరు పాట పెట్టండి. మనం ఎక్కడి నుంచి వచ్చామో ఆ మూలాలు మరచిపోకూడదని నే చదివిన రెండు లక్షల పుస్తకాల్లో ఓ పుస్తకంలో రాసుంది. అన్నయ్యా నాగూ... ఎల్. విజయలక్ష్మిలా డాన్సు చేయి అన్నా" అన్నారు. "తమ్ముడూ... ఓ మాట ఈ 24 ఎందుకో బాగోలేదు. మరీ దొరికిపోతామేమో... ఆ నంబర్‌ని 23 చేస్తే మంచిదని నాకెందుకో అనిపిస్తోంది. ఇలా అయితే మహా జబర్దస్త్‌గా ఉంటుందనీ" అంటూ సలహా ఇవ్వబోయారు అక్కడే ఉన్న నాగులన్నయ్య. "నో... నెవ్వర్... వద్దు బ్రదర్. అస్సలొద్దు...." ఉన్నట్టుండి బాబు గారి ముఖం ఆగ్రహంగా మారింది. "నాన్నారు... ఎందుకీ ఈకాలపు ఆగ్రహం" అన్నారు పచ్చి మిరపకాయ బజ్జీల ప్లేటులోంచి ఓ బజ్జీ తీసుకుని ఓ అలౌకికానందం అనుభవిస్తున్న ఫుడ్డేష్. "బాబూ ఫుడ్డేష్, ఈకాలపు కాదురా. అకాలపు అనాలి. ఏళ్లు గడుస్తున్నా నీకు తెలుగు రాకపోగా తెగులు తగ్గడం లేదు" అంటూ విచారంగా అన్నారు అక్కడే ఉన్న టెక్కలి వారబ్బాయి. "వద్దు... వద్దు... వద్దే వద్దు. ఈ 23 మాట నా చెవిన పడకూడదు. మనం అధికారంలోకి వచ్చాక ఈ 23 ని నిషేధిస్తూ నేను తొలి సంతకం చేస్తా" కాసింత ఆగ్రహం తగ్గించి అన్నారు బాబు. "పోనీ 25 చేస్తే" నాగులన్నయ్య చాలా ఉత్సాహంగా అన్నారు. మళ్లీ గట్టిగా "నో" అని వినిపించింది. ఈ సారి అందరూ బాబు వైపు చూశారు. అక్కడి నుంచి కూడా కాదు ఆ పొలికేక. తలలు తిప్పి చూస్తే ఆ కేక వచ్చింది పీకే నుంచి. దూరంగా కెవ్వు కేక... కెవ్వు కేక అని పాట వినిపిస్తోంది. "వద్దు. వద్దు. ఆ పావలా మాట నాకు వినపడకూడదు. మనం అధికారంలోకి వస్తే ఈ పావలాని కూడా నిషేధిస్తూ సంతకం చేయమని బాబుగారికి నా విన్నపం" అన్నారు. "ఇవన్నీ ఎందుకు లెండి. ఆ 24 ఖాయం చేయండి." అన్నారు ఎవరో. ఎవరి నుంచి ఆ మాట వచ్చిందా అని అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఒక్క పీకే మాత్రమే తల దించుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు.

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

సీనియర్ జర్నలిస్టు, ఫోన్: 9120 19929

మోదీ పాలనలో సమాఖ్యస్ఫూర్తి విచ్ఛిన్నం

చలసాని వెంకటరామారావు

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ ఒకటి ఇండియా అనగా భారతదేశం. అది రాష్ట్రాలు యూనియన్‌గా ఉండాలని చెప్పింది. సమాఖ్య విధానం ద్వారా దేశం జాతీయ స్వభావాన్ని సంతరించుకుంది. దేశంలో రాజకీయ వికేంద్రీకరణ ఉంది. దానితోపాటు బలమైన కేంద్ర ప్రభుత్వం కూడా ఉంది. దేశ నిర్మాణంలో అంతర్ రాష్ట్ర సంబంధాలు సైతం ప్రముఖపాత్ర వహిస్తాయి. ఫెడరలిజం ద్వారానే దేశపాలనా విధానం కొనసాగుతుంది. రాజ్యాంగంలోని 12వ భాగం, ఆర్టికల్ 264 నుంచి 293 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సంబంధాలను గూర్చి వివరించింది. రాష్ట్రాలకు రావలసిన గ్రాంట్లు, నిధులు, ఆస్తి వ్యవహారాలు, కాంట్రాక్టులు గురించి వివరించింది. కేంద్ర ప్రభుత్వ విధించిన పన్నులు, వాటిలో రాష్ట్రాలకు రావలసిన వాటా తదితర అంశాలు స్పష్టం చేశారు. అంతర్ రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సరళిలో జరిగే సేవలపై పన్నులు విధించి, పార్లమెంటుచేసే చట్టాన్ననుసరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం బలహీనమైన, అవసరమైన రాష్ట్రాలకు రెవెన్యూ సహాయక గ్రాంటుల రూపంలో కొంత నిధిని అందిస్తుంది. ఆయా రాష్ట్రాలలోని షెడ్యూల్ తెగల జనాభా ప్రాతిపదికన అభివృద్ధి సాధించిన రాష్ట్రాలతో పాటు సమతుల్యతను సాధించేందుకు ప్రత్యేక గ్రాంట్ల ద్వారా కేంద్రప్రభుత్వం సహాయం అందించాలి. ఈ విధంగా భారత రాజ్యాంగం సమాఖ్య స్ఫూర్తిని సూచించింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య సన్నిహిత సహకారం వాంఛించింది. అందుకు కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వచించింది. ఆర్థికలోటు, వ్యవస్థీకృత ద్రవ్యమార్కెట్ నుంచి రుణాలు, విదేశీ సహాయం వంటి అంశాలు కేంద్రం పరిధిలో ఉంటాయి. కానీ రాష్ట్రాలకు పరిమితమైన వనరులు మాత్రమే ఉంటాయి. అందువల్ల ఆర్థిక పరిపుష్టి విషయంలో రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై ఎప్పుడూ ఆధారపడి ఉంటాయి. గత 10 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడుతున్నదని, రాష్ట్రాల హక్కులను హరించి, వివక్షత ప్రదర్శిస్తున్నట్లు వివిధ రాష్ట్రాలు విమర్శిస్తున్నాయి. గవర్నర్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాష్ట్రాల పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకోవటం, న్యాయబద్ధంగా రాష్ట్రాలకు రావల్సిన గ్రాంట్లు, నిధులను విడుదల చేయకుండా రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను అస్తవ్యస్తం చేస్తున్నారనే విమర్శ తరచుగా వినిపిస్తున్నది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటున్నారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులుఇచ్చి ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్రాలకు కేటాయింపులలో అన్యాయం చేస్తున్నారని వాదిస్తున్నారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, సమానత్వ సూత్రానికి తిలోదకాలు ఇవ్వటం ప్రజాస్వామ్యంలో అరిష్టమని పేర్కొంటున్నారు.

కర్నాటక, కేరళ రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్రం చూపిస్తున్న సవతి తల్లి ప్రేమకు నిరసనగా ఫిబ్రవరి 7, ఫరీదా న్యూ ఢిల్లీలో కర్నాటక రాష్ట్ర మంత్రులతో సహా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఫిబ్రవరి 8వ తేదీ కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నాయకత్వంలో రాష్ట్ర మంత్రులు, ఎల్‌డిఎఫ్ శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు దిల్లాలో నిరసన చేపట్టారు. ఈ నిరసనకు మద్దతుగా ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు కేజ్రీవాల్, భగవత్ మాన్, తమిళనాడు రాష్ట్ర మంత్రి పి.త్యాగరాజన్, నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు, కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా పాల్గొన్నారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ నాయకులు అబ్బుల్



Part I

The Union and its Territory

Name and territory of the Union.

1. (1). India, that is Bharat, shall be a Union of States.

(2). The States and the territories thereof shall be the States and their territories specified in Parts A, B and C of the First Schedule.

(3). The territory of India shall comprise —

(a) the territories of the States;

(b) the territories specified in Part D of the First Schedule; and

(c) such other territories as may be acquired.

Admission or

వహాబ్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేరళ రాష్ట్ర కాంగ్రెస్ మౌనంగా ఉన్నా కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వం మద్దతు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం వివక్షతకు నిరసనగా రాష్ట్ర వ్యాపితంగా ఎల్‌డిఎఫ్ భాగస్వామ్య పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించాయి. కార్మికసంఘాలు, యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్దఎత్తున ప్రదర్శనలు, వీధి సమావేశాలు నిర్వహించారు. సీపీఐ, కేరళ కాంగ్రెస్ (మణి), ఎన్‌సీపీ ఇండియన్ నేషనల్ లీగ్, కాంగ్రెస్ (సెక్యులర్), జనతాదల్(సెక్యులర్) పార్టీలు ఈ ఆందోళనలో పాల్గొన్నాయి. ఏకకాలంలో రాష్ట్ర వ్యాపితంగా 1500 సభలను వీరు నిర్వహించారు. కేంద్ర పన్నులలో రాష్ట్రానికి రావల్సిన న్యాయబద్ధమైన వాటాను, పెండింగ్ గ్రాంట్‌ల విడుదలను వీరు డిమాండ్ చేశారు. కేరళ రాష్ట్ర గుణపరిమితి కేంద్రం తగ్గించింది. తమకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాల రుణ పరిమితి పూర్తయినా వారికి అదనంగా రుణాలు మంజూరు చేస్తూ కేంద్రం వివక్షతను చూపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాల అమలుకు ఇచ్చే నిధులను సైతం కేరళ రాష్ట్రానికి విడుదల చేయలేదు. గత నాలుగు సంవత్సరాలలో కేరళ రాష్ట్రం రెండు భారీ వరదలకు గురై తీవ్రంగా నష్టపోయింది. ఆర్థిక రంగంలో తీరని నష్టాలను చవిచూసినప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహాయం, చేయూత అందకపోగా, వచ్చిన విదేశీ సాయాన్ని కూడా నిరాకరించింది. రాష్ట్ర రెవెన్యూలో వచ్చినలోటును భర్తీ చేయలేదు. కేంద్ర ప్రభుత్వం 5వ ఆర్థిక సంఘాల నిధులను, కేంద్ర పథకాల నిధులను తక్షణం విడుదల చేయాలని కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డు (కేఐఐఎఫ్‌బీ) కేరళ సోషల్ సెక్యూరిటీ ఫైనాన్స్ (లి) (కేఎస్‌ఎస్‌పీఎల్) రుణాల పబ్లిక్ రుణాల నుంచి మినహాయించాలని కేరళ ప్రభుత్వం కోరుతోంది. 2017-2023 మధ్య కాలంలో రాష్ట్రానికి రావలసిన అనేక సహాయాలను నిరాకరించడం వల్ల 107,000 కోట్లు తమ రాష్ట్రానికి నష్టం జరిగిందని, కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కార్పొరేట్ ప్రయోజనాలకోసం సరిపడ పన్నును కేంద్రం తగ్గించటం వల్ల రాష్ట్రాలను ఆదుకోవటంలో కేంద్రం వెనుకంజ వేస్తున్నది. పరోక్ష పన్నుల ద్వారా పేద వర్గాలపై భారం వేస్తున్నది. కేంద్రానికి వచ్చే సెస్సులు, సర్‌చార్జీలు పెంచి వేయటం వల్ల కూడా రాష్ట్రాలకు రావల్సిన పన్నుల వాటా తగ్గిపోయింది. కేంద్ర ప్రయోజనాల కోసం రాష్ట్రాల పీక నొక్కివేసే చర్యలకు కేంద్రం పూనుకుంటున్నది. ఈ రకమైన ఆర్థిక వివక్షత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సమర్థించని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. దీనితో దక్షిణాది రాష్ట్రాలు, ఉత్తరాదిరాష్ట్రాలు అనే భేదభావం పెరిగిపోతున్నది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలలో వైరుధ్యాలు చోటుచేసుకుంటున్నాయి. కర్నాటక, పంజాబ్, తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలు సైతం ఈ రకమైన వివక్షతకు గురవుతున్నాయి. వర్తమానార్థిక సంవత్సరంలో వస్తు సేవల పన్నుపరిహారం ఇవ్వనందున 2వేల కోట్లకుపైగా నష్టపోయామని, మొత్తం మీద 57 వేల కోట్లకుపైగా నష్టం జరిగిందని కేరళ ప్రభుత్వం ప్రకటించటం రాష్ట్రాల పరిస్థితికి అద్దంపడుతోంది.

రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే, ఎన్నికైన ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో రాజ్యాంగ అధిపతులుగా కేంద్రం నియమించిన గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల జోక్యం పెరిగిపోయింది. వారు రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను నెలల తరబడి ఆమోదించకుండా ఇబ్బందులు కల్పిస్తున్నారు. గవర్నర్లు కేంద్రం తొత్తులుగా వారి రాజకీయ అవసరాలమేరకు రాష్ట్రాలతో వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వాల ఆలనా పాలనా వ్యవహారాలు సజావుగా సాగకుండా గుదిబండలుగా గవర్నర్లు వ్యవహరిస్తున్నారు. తరచుగా రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణలకు తలపడుతున్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైన తీరులో వీరి వ్యవహారశైలి ఉంటున్నది. కేంద్ర, రాష్ట్రాల మధ్య రాజకీయ విభేదాలు ఉండవచ్చును. అన్ని రాష్ట్రాలలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉండకపోవచ్చు. కానీ అక్కడ కేంద్రం కావాలని సంక్షోభాలను సృష్టించడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, పంజాబ్, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇటువంటి ఘర్షణలకు గవర్నర్ వ్యవస్థ కేంద్ర బిందువు కావటం విమర్శలకు గురైంది. సుప్రీంకోర్టు అనేక సందర్భాలలో సమాఖ్యస్ఫూర్తిని గుర్తుచేస్తూ తీర్పులు ఇచ్చినప్పటికీ కేంద్రం వాటిని లక్ష్య పెట్టటంలేదు. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై 1983లో సర్కారియా కమిషన్ 247 నిర్దిష్ట ప్రతిపాదనలను సిఫార్సు చేసింది. వాటిని కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. సర్కారియా కమిషన్ రాజ్యాంగ మార్పులు కోరినా వాటిని పట్టించుకునే నాథులు కరువయ్యారు. 2007 ఏప్రిల్ 27న మదన్‌మోహన్ పూంచే అధ్యక్షతన కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై ఒక కమిషన్ నియమించారు. 2010 మార్చి 30న 273 సిఫార్సులను ఆ కమిషన్ ఇచ్చింది. అయినా రాజ్యాంగ మౌలిక స్ఫూర్తి అయిన రాష్ట్రాల సమాహారమే కేంద్రం అనే భావన కలగటం లేదు. సమాఖ్యస్ఫూర్తిని ధ్వంసం చేస్తే దేశం ఐక్యంగా ముందుకువెళ్లటం కష్టం. ప్రస్తుత అనుభవం దృష్ట్యా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాల ప్రయోజనాల సంరక్షణ అందరి కర్తవ్యంగా ఉంది.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

కనీస మద్దతు ధర చట్టం అవశ్యం

పతకమూరు దామోదర్ ప్రసాద్

పంటలకు కనీస మద్దతుధర కల్పిస్తూ చట్టం చేయడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా అన్నదాతలు మళ్లీ ఆందోళనబాట పట్టారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ చట్టం తేవాలని, 60ఏళ్లు నిండిన రైతులకు,కూలీలకు నెలకు రూ 3వేలు పింఛన్ ఇవ్వాలని, రైతు రుణాల రద్దును కోరుతూ పంజాబ్,హర్యానా,యుపి తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు తమ ట్రాక్టర్లు ఇతరవాహనాలతో గత కొన్ని రోజులుగా దేశ రాజధాని ఢిల్లీ నగర శివార్లలో నిరవధికంగా ధర్నా చేస్తున్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కనీస మద్దతు ధరను కాగితాలకే పరిమితం చేసి, అమలుకు చట్టం చేయకుండా విపరీత జాప్యం చేయడం, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించు కోకపోవడం కర్షకులు మళ్లీ ఉధృత ఆందోళన ప్రారంభించడానికి ప్రధాన కారణం. కిసాన్ మజ్దూర్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చాల పిలుపు మేరకు రైతు బృందాలు ఫిబ్రవరి 13న రాజధాని ఢిల్లీ వైపు కదిలాయి. పంజాబ్ రైతులు హర్యానా మీదుగా శంభు - అంబాలా- ఖ నూరీ-జింద్ అంతర్రాష్ట్ర సరిహద్దులకు చేరుకోగా వారిని హర్యానాలో ప్రవేశించకుండా అక్కడి బీజేపీ ప్రభుత్వం అడుగడుగునా ఇనుప తీగెలుముళ్లకంచెలు, ఇతర అడ్డుగోడలు నిర్మించి అన్నదాతలు ముందుకు రాకుండా అడ్డుకున్నది. కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద రాయ్‌తో కూడిన మంత్రుల బృందం రైతునాయకులు జగ్జిత్ సింగ్, స్వరన్ సింగ్ పాంథర్ ప్రభృతులతో నాలుగుసార్లు జరిపిన చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. మినప, కంది, పెసర, మొక్కజొన్న, పత్తి పంటలను కొంటా మని కేంద్రం హామీ ఇచ్చినా, ఐదేళ్ల కాంట్రాక్టు మెలిక పెట్టడంతో రైతు సంఘాలు అందుకు అంగీకరించలేదు. దేశ జనాభాలో ఇప్పటికీ 43శాతం పైగా ప్రజలు వ్యవసాయం, అనుబంధ రంగాలే ఆలంబనగా జీవనం సాగిస్తున్నారు. దుర్భిక్షాలు, కరవులు, వరదలు, అకాలవర్షాలు, వడగండ్లు, గాలి ఉధృతి వంటి ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ఒడిదుడుకులేకాక ప్రభుత్వాల నిర్లక్ష్యం, విధాన వైఫల్యాలు, దళారీలు, వ్యాపారుల దోపిడీ వల్ల కూడా అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు సరైన ధరలు లభించక ఎన్నో కష్ట నష్టాలకు గురవుతున్నారు. ఇట్టి పరిస్థితులలో పంటలకు కనీస మద్దతు ధరకు హామీ ఇస్తూ కేంద్రం చట్టం తెస్తేనే అన్నదాతలకు కొంతయినా ఊరట కలుగుతుంది.

మనదేశం 1960వ దశకం ఆరంభంలో తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంది. అమెరికా నుంచి పీఎల్ 480కింద గోధుమలు, ఇతర ఆహారధాన్యాలు వస్తేనే మన ప్రజల కడుపులు నిండేది. ఈ విపత్కర పరిస్థితిని అధిగమించడానికి ఆహార రంగంలో స్వయం సమృద్ధి సాధించాలని అప్పటి పాలకులు హరితవిప్లవం తేవాలని నిర్ణయించి పరిశోధనలను ప్రోత్సహించారు. హరిత విప్లవ పితామహుడైన డా.ఎం.ఎస్ స్వామినాథన్ బృందం సారథ్యంలో మన శాస్త్రవేత్తలు ఎన్నో అధిక దిగుబడినిచ్చే వరి, గోధుమ సంకర రకాలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. ట్రాక్టర్లు ఇతర ఆధునిక సేద్యపరికరాలను కూడా అందించి, రుణసదుపాయం కూడా కల్పించడంతో మన రైతులు ఇబ్బడి ముబ్బడిగా పంట సిరులు కురిపించారు. పండించిన పంటలను కనీస మద్దతు ధరలకు కొంటామని కేంద్రం హామీ ఇచ్చి అందుకోసం భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ని ప్రారంభించి వరి, గోధుమల కొనుగోలును ప్రారంభించింది. హరిత విప్లవం ప్రధానంగా పంజాబ్, హర్యానా, పశ్చిమ యూపీలో అమలు జరిగి అక్కడి రైతులు పాడి పంటలతో సమృద్ధి సాధించడానికి తోడ్పడింది. వర్షాధారంగా పంటలు పండించే రైతులకు ఎలాంటి సాయం అందడం లేదనే విమర్శలు రావడంతో కనీస మద్దతు ధరలు 23పంటలకు ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చి అరకొరగా అమలు చేస్తున్నది.
చెరకు,మొక్కజొన్న,పత్తి, కంది, మినుము,పెసర,శెనగ,కొబ్బరి తదితర 23పంటలకు 1967లో కేంద్రం కనీస మద్దతు ధరలు హామీ ఇచ్చింది. అయితే వీటికి చట్టపరమైన హామీ ఏదీ లేదు. ఏటా వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటిస్తుంది. ఈ సిఫార్సులను కేంద్ర మంత్రి మండలి ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు. లేదా ధరలు కొంత మెరుగు పరచి ప్రకటించవచ్చు. వరి, గోధుమ, చెరకు పంటలకే మద్దతు ధరలు వర్తింప జేస్తున్నందున పంజాబ్, హర్యానా, పశ్చిమ యూపీకే ఫలితాలు దక్కుతున్నాయి. ఇలా కనీస మద్దతు ధర పంటల కొనుగోళ్లలో విధించే మండి పన్నులు ఆయా రాష్ట్రాలకు పెద్ద ఆదాయవనరుగా ఉన్నాయి. మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు అప్పుడప్పుడు పప్పు దినుసులను కనీస మద్దతు ధరలకు కొంటున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా వరి పంటనే కొంటున్నారు. తెలంగాణలో రబీలో ఎక్కువగా పండించే దొడ్డు రకం వరిని కొనడానికి ఎఫ్‌సీఐ, కేంద్రం నిరాకరించడంతో ఏడాది క్రితం వివాదం రగిలిన సంగతి తెలిసిందే. వరి, గోధుమ మద్దతు ధరలు ప్రధానంగా మిగులు ఉండే పెద్ద రైతులకే దక్కుతున్నాయని, చిన్న, సన్నకారు రైతులు కల్లాల లోనే దళారీలు, మిల్లర్లకు తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితులలో కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్లు ఊపందుకున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల రైతులు అందుకోసం ఢిల్లీ శివార్లలో ఉధృత ఆందోళన సాగిస్తున్నారు. బహిరంగ విపణిలో ఒక స్థాయికి కంటే ధరలు తగ్గినప్పుడు మాత్రమే ఎంఎస్‌పి విధానం అమల్లోకి వస్తుంది. అది సగం సమయాలలో మాత్రమే అవసరమవుతుంది. ప్రభుత్వం కనీస మద్దతు ధరలకు సేకరణ ప్రారంభించగానే మార్కెట్లో వాటి ధరలు పెరుగుతాయి. అందువల్ల ఎక్కువకాలం కొనసాగించనవసరంలేదు. మోదీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రారంభించిన పంటల బీమా పథకం వల్ల అన్నదాతలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ప్రకృతి వైపరీత్యాల వల్ల అనేక పంటలకు నష్టం జరిగినపుడు, మార్కెట్‌లో ధరలు పడిపోయినపుడు రైతులకు ఎలాంటి బీమా పరిహారం అందలేదు. అది మోదీ ప్రచారానికి వాడుకున్న విఫల పథకంగా మిగిలిపోయింది. కనీస మద్దతు గ్యారంటీ అనేది ఉపాధి హామీ పథకం వంటిదే. కరవు దుర్భిక్షాలు వచ్చినపుడు కూలీలకు ఉపాధి కల్పించినట్లు కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తే రైతులకు ఉపయోగపడుతుంది. దేశంలో రుతుకుతుంబాల ఆర్థిక స్థితిగతులపై 70, 77వ జాతీయ నమూనా సర్వే గణాంకాలను పరిశీలిస్తే సేద్యం ఆదాయం కంటే వేతన ఆదాయం పెరిగినట్లు తేలింది. రైతు కుటుంబాల నెలసరి సగటు ఆదాయం రూ 10వేలు కాగా రుణభారం తగ్గలేదు. పల్లెలు, సేద్యపు రంగంలోనే దారిద్ర్యం ఎక్కువున్నట్లు వెల్లడి అయింది. 2022నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ బూటకంగా మిగిలిపోయింది. దేశంలో 80కోట్లమందికి ఉచిత బియ్యం సరఫరాను పొడిగించడం దారిద్ర్యం తగ్గలేదనడానికి నిదర్శనం. ఒకప్పుడు పెద్ద పెద్ద విస్తీర్ణాలుగా ఉన్న భూకమతాలు తరాలు మారి కుటుంబాలు విడిపోయి ఐదెకరాల లోపు ఒకటి, రెండెకరాల చిన్నవిగా మారడంతో సేద్యం లాభదాయకంగా లేదు. ప్రస్తుతం దేశంలో అలాంటి చిన్నవి14.1కోట్ల కమతాలున్నాయి. పట్టణాలు,నగరాలలో ఎక్కువ వేతనాలు ఇచ్చే ఉద్యోగాలు లేనందున వారంతా విధిలేక పల్లెల్లోనే బతుకులు వెళ్లదీస్తున్నారు. పారిశ్రామిక, సేవా రంగాలలో అవసరమైన ఉద్యోగాల వృద్ధి లేదు. వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరగక పోవడం కూడా మన సేద్యపురంగ దుస్థితికి కారణం. మండి చట్టాలలో సవరణలు, పంట ఎగుమతులపై నిషేధాలు సడలించడం, కాంట్రాక్టు సేద్యం, కౌలు రైతులకు రుణ సదుపాయం, మండిల అనుసంధానం, పంటలమార్పిడి కి ప్రోత్సాహం కొంత మెరుగు పరిచినా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తేనే అన్నదాతలకు మెలుజరిగేది.

సీనియర్ జర్నలిస్ట్
9440990381

అప్పుడే అయిపోలేదు

- తిరుగుబాటు శిబిరంలో మరో ఇద్దరు?
- హిమాచల్‌లో అప్రమత్తమైన కాంగ్రెస్
- రెబెల్ ఎమ్మెల్యేల బుజ్జగింపు
- రంగంలోకి విక్రమాదిత్య



న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ పరిణామాలతో హిమాచల్ ప్రదేశ్‌లోని అధికార కాంగ్రెస్ లో ఏర్పడ్డ సంక్షోభం ఇంకా ముగిసినట్లు లేదు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు మరికొందరు తోడవుతున్నట్లు తెలియడంతో కాంగ్రెస్ పార్టీ మరింత జాగ్రత్త పడింది. ప్రభుత్వం కుప్పకూలిపోయే అవకాశాలు పూర్తిగా పోయేంతవరకు అప్రమత్తత అవసరమని ఆ పార్టీ భావిస్తోంది. ఈ తరుణంలో మంత్రి విక్రమాదిత్య సింగ్‌ను రంగంలోకి దించింది. రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డ ఆరుగురు ఎమ్మెల్యేలపై హిమాచల్ ప్రదేశ్ స్పీకర్ అనర్హత వేటు వేయడంతో ప్రభుత్వం పడిపోయే స్థితి నుంచి కాంగ్రెస్ బయటపడ్డ సంగతి విదితమే. ప్రస్తుతం ఆ ఎమ్మెల్యేలు బీజేపీ పాలిత హర్యానాలోని పంచకులాలో మకాం వేశారు. స్పీకర్ నిర్ణయాన్ని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ క్రమంలో.. ఆ రాష్ట్ర మంత్రి విక్రమాదిత్య సింగ్ ఆ ఆరుగురిని కలవడం అక్కడి రాజకీయాలను ఆసక్తికరంగా మార్చేసింది. ఆరు సార్లు హిమాచల్ ముఖ్యమంత్రిగా చేసిన దివంగత నేత వీరభద్రసింగ్ కుమారుడైన విక్రమాదిత్య సింగ్... హిమాచల్ కేబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నారు. మొన్నటి రాజ్యసభ ఎన్నికల్లో విక్రమాదిత్య క్రాస్ ఓటింగ్‌కు పాల్పడకపోయినప్పటికీ అదేరోజు మీడియా ముందు భావోద్వేగంతో మాట్లాడారు. తన తండ్రిని కాంగ్రెస్ తీవ్రంగా అవమానిస్తోందని చెబుతూనే... బీజేపీతో పోరాటే శక్తి కాంగ్రెస్‌కు లేదంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే పార్టీకి, పదవికి సైతం ఆయన రాజీనామా చేశారు. అయితే అధిష్ఠానం జోక్యంతో సాయంత్రానికి ఆయన చల్లబడ్డారు. తన రాజీనామాను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఇలాంటి సంక్షోభ సమయంలో తాను పార్టీని వీడొద్దని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కాగా శుక్రవారం ఉదయం రెండ్రోజుల దిల్లీ పర్యటనకు బయల్దేరిన విక్రమాదిత్య.. .. మార్గం మధ్యలో ఆ ఆరుగురు తిరుగుబాటు ఎమ్మెల్యేలను కలుసుకున్నట్లు తెలిసింది. దిల్లీ పర్యటన ముగిశాక తిరుగు ప్రయాణంలోనూ ఆయన మరోసారి వాళ్లతో సమావేశమవుతారని తెలుస్తోంది. కాగా ఆరుగురు తిరుగుబాటు ఎమ్మెల్యేలకు మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కలిసినట్లు చెబుతున్నారు. దీంతో ఈ సంఖ్య మరింత పెరగకమునుపే... విక్రమాదిత్యను రంగంలోకి దించి పరిస్థితిని చక్కదిద్దాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది.

అవునా... నాకు తెలియదు: ప్రతిభా సింగ్

తిరుగుబాటు ఎమ్మెల్యేలను విక్రమాదిత్యసింగ్ కలిసినట్లు వస్తున్న వార్తలపై ఆయన తల్లి, హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రతిభా సింగ్ స్పందించారు. జాతీయ మీడియా సంస్థతో ఆమె మాట్లాడుతూ... తన కుమారుడి పర్యటన షెడ్యూల్ వివరాలు తనకి కూడా తెలియదని స్పష్టం చేశారు. గత రాత్రి తను (విక్రమాదిత్య) ఇక్కడే ఉన్నాడు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాడో నాకు తెలియదని ఆమె పేర్కొన్నారు. అయితే ఎప్పటికప్పుడు పరిణామాలను మాత్రం అధిష్ఠానానికి తాము నివేదిస్తామని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడంతో మొదటి నుంచి అసంతృప్తిగా ఉన్న వీరభద్ర సింగ్ కుటుంబం. తాజా సంక్షోభం నేపథ్యంలో కూడా మరోసారి ఆ డిమాండ్‌నే అధిష్ఠానం వద్ద ఉంచినట్లు వినవస్తోంది. అయితే సుఖ్వీందర్ సింగ్ సుఖు మాత్రం తాను పోరాట యోధుడినని... తానే ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నారు.

అనర్హత తొలగింపునకు సైతం సిద్ధం

అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేలను తిరిగి సొంతగూటికి తెచ్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. సుధీర్ శర్మ, రవి ఠాకూర్, రాజిందర్ రాణా, ఇందర్ దత్, చేతన్య శర్మ, దేవిందర్ కుమార్‌తో చర్చలు జరిపే బాధ్యతను మంత్రి విక్రమాదిత్యకు అప్పగించింది. పార్టీలోకి వచ్చే అవకాశం ఉంటే.. అనర్హత వేటు వెనక్కి తీసుకుంటామని హామీ ఇస్తున్నారని హిమాచల్ కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

'జంగల్ రాజ్'కు డబుల్ ఇంజిన్ ప్రభుత్వం హామీ

యూపీలో బీజేపీ పాలనపై రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి సంబంధించిన నిజం ఏమిటంటే ఇది 'జంగల్ రాజ్‌కి హామీ' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. శాంతిభద్రతలకు వ్యతిరేకంగా పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్త నిరసనను ప్రకటించారు. 'బీజేపీ, మోదీ మీడియా కలిసి 'అబద్ధాల వ్యాపారం'లో ఎలా మునిగిపోతున్నాయి అనేదానికి యూపీలోని శాంతిభద్రతల పరిస్థితి అతిపెద్ద ఉదాహరణ' అని ఆయన హిందీలో ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో విమర్శించారు. మహిళలపై ఇటీవల జరిగిన అనేక నేరాలను ఎత్తిచూపుతూ, మైనర్ సోదరీమణుల మృతదేహాలు కొన్ని చోట్ల చెట్లకు వేలాడుతున్నాయని పేర్కొన్నారు. 'ఎక్కడో ఐఐటీ-బీహెచ్‌యూ క్యాంపస్‌లో బీజేపీ సభ్యుల సామూహిక అత్యాచారం, ఎక్కడో ఒక మహిళా జడ్జికి న్యాయం జరగలేదని బలవన్మరణానికి పాల్పడింది. శాంతిభద్రతల వ్యవస్థను అవిశ్రాంతంగా ప్రశంసిస్తున్న ఆ రాష్ట్ర పరిస్థితి ఇది' అని రాహుల్ అన్నారు. ఇటీవల రాంపూర్‌లో 10వ తరగతి పరీక్షలు రాసి తిరిగి వస్తున్న దళిత విద్యార్థిని హత్య చేసిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. 'మోదీ మీడియా సృష్టించిన తప్పుడు చిత్రం నుంచి బయటకు రావాల్సిన అవసరం, డబుల్ ఇంజన్ ప్రభుత్వం 'జంగల్ రాజ్‌కి హామీ' అనే నిజం చూడాల్సిన సమయం ఆసన్నమైంది' అని కాంగ్రెస్ నేత అన్నారు. 'బీజేపీ వ్యవస్థ, ఈ నేరస్తుల కూటమికి వ్యతిరేకంగా ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కార్యకర్తలు ఈ రోజు ప్రతి జిల్లాలో, ప్రతి తహసీల్‌లో నిరసనలు చేయడం ద్వారా న్యాయం కోసం తమ గళాన్ని పెంచుతారు' అని ఆయన పేర్కొన్నారు.

రామేశ్వరం కేఫ్‌లో పేలుడు

- తొమ్మిదిమందికి గాయాలు
- బెంగళూరులో కలకలం
- ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు

బెంగళూరు: కర్నాటక రాజధాని నగరం బెంగళూరులో భారీ పేలుడు సంభవించింది. ఒక్కసారి జరిగిన ఘటనతో నగరం ఉలిక్కిపడింది. రాజాజీనగర్ ప్రాంతంలోని రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజనం సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ పేలుడులో ముగ్గురు కేఫ్ సిబ్బందితో పాటు మరో ఆరుగురు గాయాలపాలయ్యారు. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సిలిండర్ పేలడం వల్లే మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రెస్టారెంట్‌లోని ఓ బ్యాగ్‌లో ఉంచిన వస్తువుకు పేలుడు స్వభావం ఉందని, అది పేలిపోయి ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మరోవైపు.. నగరంలోని 44 ప్రైవేట్ పాఠశాలలకు శుక్రవారం ఉదయం ఇ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాల ఆవరణలో పేలుడు పదార్థాలు అమర్చినట్లు ఇ-మెయిల్ లో పేర్కొన్నారు. వైట్‌ఫీల్డ్, కోరమంగళ, బస్వేష్‌నగర్, యలహంక, సదాశివనగర్ సహా బాంబు బెదిరింపు వచ్చిన అన్ని పాఠశాలలకు బాంబు స్క్వాడ్‌లను పంపించారు. విద్యార్థులను, సిబ్బందిని వెంటనే పాఠశాల నుంచి ఖాళీ చేయించారు. 'మేము ఇ-మెయిల్ లో పేర్కొన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. తనిఖీ చేసేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఇంకా అనుమానాస్పద వస్తువులను స్వాధీనం చేసుకోలేదు' అని కర్నాటక హోంమంత్రి జి.పరమేశ్వర్ వెల్లడించారు. 24 గంటల్లో మెయిల్ పంపిన వారిని పట్టుకుంటామని, ఈ ఘటనను సైబర్ క్రైమ్ పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు ఉన్నతాధికారులు వివరించారు.

అన్యాయ కాలం అంటే ఇదే...

ఈపీఎఫ్ రేట్లపై కేంద్రాన్ని నిందించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) తుది పరిష్కార తిరస్కరణ రేట్లు పెరగడంపై కాంగ్రెస్ శుక్రవారం ప్రభుత్వాన్ని నిందించింది. పది సంవత్సరాల 'అన్యాయ కాలాన్ని' నిర్వచించే లక్షణం ఏ వర్గమూ వారి పూర్తి బకాయిలను పొందలేకపోయిందని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాలు) ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో మీడియా నివేదికను పంచుకున్నారు. ఇది ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) తుది పరిష్కార తిరస్కరణ రేట్లు పెరుగుతున్నాయని పేర్కొంది. ఇది 2017-18లో దాదాపు 13 శాతం నుంచి 2022-23లో దాదాపు 34 శాతానికి పెరిగింది. '10 సంవత్సరాల 'అన్యాయ కాలం'ను నిర్వచించే లక్షణం ఏమిటంటే, ఏ సమాజం కూడా దాని పూర్తి హక్కును పొందలేకపోయింది. మహిళలు జాబ్ మార్కెట్‌కు దూరంగా ఉన్నారు. యువత ఉపాధి పొందలేకపోతున్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులకు తగిన ధరలను పొందలేక పోతున్నారు' అని విమర్శించారు. 'వేతనాలతో జీవనోపాధి పొందే కార్మికుడు కూడా తన స్వంత సంపాదనను పొందలేకపోతున్నాడు. భారత కార్మికుల కోసం భవిష్య నిధిని నిర్వహించే ప్రభుత్వ సంస్థ అయిన ఈపీఎఫ్... ఉద్యోగ భవిష్య నిధి క్లెయిమ్‌ల తుది పరిష్కారం కోసం తిరస్కరణ రేట్లలో తీవ్ర పెరుగుదలను చూసింది' అని ఆయన పేర్కొన్నారు. 2017-18లో 13 శాతంగా ఉన్న ఈపీఎఫ్ తుది పరిష్కారానికి సంబంధించి మూడింటిలో ఒకటి ఇప్పుడు తిరస్కరణకు గురైందని ఆయన చెప్పారు. ప్రతి తిరస్కరణ కార్మిక కుటుంబాలకు తీవ్ర ఒత్తిడి, వేదన కలిగించే విషయమని అన్నారు. క్లెయిమ్‌లను పరిష్కరించే విషయంలో ఆన్ లైన్ వ్యవస్థను 'తప్పుగా' నిర్వహించడం ఈ తిరస్కరణకు ప్రధాన కారణమని పేర్కొంటూ, ఈపీఎఫ్‌వో సున్నితమైన, బ్యూరోక్రాటిక్ విధానాల వల్ల కనీసం ఒక విశ్రాంత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు' అని జైరాం రమేశ్ అన్నారు. కాంగ్రెస్ 'పంచ న్యాయ అజెండా'లో 'శ్రామిక న్యాయం (కార్మికులకు న్యాయం) అనేది ఒక ప్రధాన సూత్రం అని నొక్కి చెబుతూ, ఇది ఏ కార్మికుడికి లేదా వారి కుటుంబానికి వారి శ్రమకు సంబంధించిన పూర్తి బకాయిలు ఎప్పటికీ నిరాకరించబడదని నిర్ధారిస్తుందని పేర్కొన్నారు.

పరీక్షల మాఫియాకు బీజేపీ సర్కార్ రక్షణ

ప్రశ్నపత్రాల లీక్‌పై ప్రియాంక గాంధీ వాద్రా ధ్వజం

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్‌లో మరో పరీక్షకు సంబంధించి ప్రశ్నా పత్రం లీకయిన ఘటనపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా శుక్రవారం రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిందించారు. పరీక్షా మాఫియా, అవినీతిపరులను రక్షించడానికి అధికార పార్టీ కోట్లాది మంది పిల్లల, యువకుల పునాదిని పాడు చేసిందని ఆరోపించారు. యూపీ 12వ తరగతి బోర్డు పరీక్షకు సంబంధించిన గణితం, జీవశాస్త్ర ప్రశ్నా పత్రాలు గురువారం పరీక్షలు ప్రారంభమైన గంట తర్వాత వాట్సాప్ గ్రూప్‌లో షేర్ అయ్యాయి. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగ్రా జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దినేష్ కుమార్ ఫిర్యాదు మేరకు ఫతేపూర్ సిక్రీలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై మీడియా కథనాన్ని ట్యాగ్ చేస్తూ, ప్రియాంక గాంధీ ఎక్స్‌పై హిందీలో చేసిన పోస్ట్‌లో 'ప్రశ్నా పత్రం మరోసారి లీక్ అయింది! ఎందుకు అలా? బీజేపీ పాలనలో ఉద్యోగ పరీక్షల నుంచి బోర్డు పరీక్షల వరకు దాదాపు ప్రతి పేపర్ లీక్ అవుతోంది!' అని పేర్కొన్నారు. పిల్లలు తమ భవిష్యత్తును నిర్మించుకోవడం నేర్చుకున్నప్పుడు ఎదుర్కొనే మొదటి సవాలు బోర్డు పరీక్షలు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అన్నారు. ఈ తరుణంలో తమకు ఇంత పెద్ద ద్రోహం జరిగితే ఒక వారు ఏం చేస్తారని ఆమె ప్రశ్నించారు. పరీక్షల మాఫియాను, ప్రభుత్వంలో కూర్చున్న అవినీతిపరులను కాపాడేందుకు బీజేపీ కోట్లాది మంది చిన్నారులు, యువత పునాదిని కూడా ధ్వంసం చేస్తోందని ఆమె విమర్శించారు. రాష్ట్రంలోని పిల్లలు మంచి చదువులు చదివి వారి భవిష్యత్తు బాగుపడాలని బీజేపీకి ఇష్టం లేదా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రశ్నించారు. ఫతేపూర్ సిక్రీకి చెందిన కిరోలీలోని రాజహౌలీలోని అతర్ సింగ్ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌స్టిట్యూట్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతని కుమారుడు, ఇతరుల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎఫ్ఐఆర్ వివరించింది. 'ఆల్ ప్రిన్సిపాల్స్ ఆగ్రా' అనే వాట్సాప్ గ్రూప్‌లో ప్రశ్నా పత్రాలను ప్రిన్సిపాల్ కుమారుడు పోస్ట్ చేశాడనే ఆరోపణలు వచ్చాయి. ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న ఆరోపణలతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం పోలీసు కానిస్టేబుల్ నియామక పరీక్షను రద్దు చేసి, ఆరు నెలల్లోపు మళ్లీ పరీక్షకు ఆదేశించిన కొద్ది రోజుల తర్వాత ఈ సంఘటన జరిగింది.

400 సీట్లకు పైగా గెలుస్తాం: ప్రధాని మోదీ

బర్వాడ (జార్ఖండ్) : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ 400 సీట్లు గెలుచుకుంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం తెలిపారు. 'జల్ జీవన్ మిషన్', 'ఆవాస్ యోజన' పథకాల అమలులో ప్రతిపక్ష 'ఇండియా కూటమి' అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. శుక్రవారం జార్ఖండ్‌లోని ధన్‌బాద్‌లో 'విజయ్ సంకల్ప్ మహారల్లి' బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తూ, 'దేశం మోదీ హామీపై ఆధారపడి ఉన్నందున రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అబ్కీ బార్ 400 పార్ (ఈసారి మేము 400 సీట్లకు పైగా గెలుస్తాము). ఇతరుల ఆశలన్నీ ఎక్కడ ముగుస్తాయో, అక్కడ మోదీ హామీ మొదలవుతుంది' అని తెలిపారు. సింద్రీ ఫర్టిలైజర్ యూనిట్, ఉత్తర కరణ్‌పురా పవర్ ప్రాజెక్టు వంటి ప్లాంట్ల పునరుద్ధరణ మోదీ హామీని నెరవేర్చడానికి ఉదాహరణ అని ఆయన అన్నారు. జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమిపై తీవ్ర దాడిని ప్రారంభించిన మోదీ... రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆరోపించారు. జార్ఖండ్ నుంచి రికవరీ చేయబడిన ఇంత పెద్ద నోట్ల కట్టలను నేను చూడలేదు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బును వారికి తిరిగి ఇవ్వాలి. ఇది మోదీ హామీ' అని తెలిపారు.

'రాష్ట్రంలో జేఎంఎం నేతృత్వంలోని పాలనలో దోపిడీ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. బుజ్జగింపు విధానం చొరబాట్లకు దారితీసింది. ప్రతిపక్ష కూటమి అభివృద్ధి వ్యతిరేకం, ప్రజా వ్యతిరేకమని అని పేర్కొంటూ 'ఇండియా కూటమి'పై ఆరోపణలు చేశారు.

తృణమూల్ 'గూండారాజ్'ను ముస్లింలు తిరస్కరిస్తారు

హుగ్లీ : బెంగాల్‌లోని ముస్లింలు తృణమూల్ కాంగ్రెస్‌ను తిరస్కరిస్తారనే వాదనతో వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం శుక్రవారం బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. తృణమూల్ దురహంకారం తమకు సురక్షితమైన ఓటు బ్యాంకు ఉందన్న నమ్మకంపై ఆధారపడి ఉందని హుగ్లీలోని ఆరంబాగ్‌లో జరిగిన బహిరంగ ర్యాలీలో మోదీ అన్నారు. 'ముస్లిం మహిళలు తృణమూల్ గూండారాజ్‌ను తిరస్కరిస్తారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో (బెంగాల్‌లో) తృణమూల్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది' అని అన్నారు.

ఉత్తర 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖలీలో దాదాపు రెండు నెలలుగా జరుగుతున్న సంఘటనలు మోదీ ప్రసంగంలో ఎక్కువగా ప్రస్తావనకు వచ్చాయి. అరెస్టయిన తృణమూల్ నాయకుడు షేక్ షాజహాన్‌కు వ్యతిరేకంగా నిరసనలను ప్రస్తావిస్తూ, 'సందేశ్‌ఖలీలో మా-మతి-మనుష్‌ల డోలు కొట్టిన వారు ఏమి చేశారో దేశం మొత్తం చూస్తోంది' అని అన్నారు. 'తృణమూల్ పాలనలో ఈ నేరస్తుడు, నాయకుడు దాదాపు రెండు నెలలపాటు పరారీలో ఉన్నాడు. అతనిని ఎవరో రక్షించి ఉంటారా?' అని మోదీ ప్రశ్నించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత ఖురేషి కన్నుమూత

భోపాల్: కాంగ్రెస్ సీనియర్ నేత అజీజ్ ఖురేషి శుక్రవారం భోపాల్‌ని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. ఉత్తరప్రదేశ్, మిజోరాం గవర్నర్‌గా గతంలో ఆయన పనిచేశారు. ఖురేషీ కన్నుమూసిన వార్త తెలియగానే మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖురేషి మృతికి కాంగ్రెస్ పార్టీ నేతలతో పాటు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. అజీజ్ ఖురేషి 1941 ఏప్రిల్ 24న భోపాల్‌లో జన్మించారు. 1973లో మధ్యప్రదేశ్ కేబినెట్ మంత్రిగా పనిచేశారు. 1984లో మధ్యప్రదేశ్‌లోని సాత్నా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఉత్తరాఖండ్, మిజోరం, ఉత్తరప్రదేశ్ (అడిషనల్ చార్జ్) గవర్నర్‌గా ఆయన సేవలందించారు. 2020 జనవరి 24న అప్పటి కమల్‌నాథ్ ప్రభుత్వం ఖురేషిని మధ్యప్రదేశ్ ఉర్దూ అకాడమీకి అధ్యక్షుడిగా నియమించింది.

జేఎన్‌యూలో ఏబీవీపీ రౌడీయిజం

వామపక్ష విద్యార్థులపై దాడి

న్యూఢిల్లీ: దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. వామపక్ష విద్యార్థులపై ఏబీవీపీ గూండాలు దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టారు. వామపక్ష విద్యార్థులు సైతం ధీటుగా ప్రతిఘటించారు. రెండు విద్యార్థి సంఘాల మధ్య గొడవ హింసకు దారితీసింది. జేఎన్‌యూలో గురువారం(ఫిబ్రవరి 29) అర్ధరాత్రి రెండు విద్యార్థి సంఘాల మధ్య గొడవ జరిగింది. దీంతో రెండు విద్యార్థి గ్రూపులు తన్నుకున్నాయి. పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో పార్కింగ్ ఏరియాలో వందలాది మంది విద్యార్థులు గుమిగూడి వాగ్వాదానికి దిగడం కనిపిస్తోంది. ఆ తర్వాత ఒకరిపై ఒకరు ముష్టియుద్ధానికి దిగారు. ఓ విద్యార్థి రెండు చేతులతో సైకిల్ పైకెత్తి దాడి చేస్తున్న దృశ్యం వీడియోలో కనిపించింది. చాలా మంది విద్యార్థులు కర్రలతో కొట్టుకుంటున్నారు. ఆ తర్వాత అక్కడ తొక్కిసలాట జరిగింది. విద్యార్థి సంఘం ఎన్నికలకు ముందే రెండు గ్రూపుల విద్యార్థులు పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ ఘటన నేపథ్యంలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా వారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎవరూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. వామపక్ష విద్యార్థులు ఈ మొత్తం ఘటనను ఏబీవీపీ గూండాయిజం అని అభివర్ణించగా, మితవాద విద్యార్థులు క్యాంపస్‌పై నక్సలైట్ల దాడిగా అభివర్ణిస్తున్నారు. ఈ క్యాంపస్‌లో విద్యార్థి సంఘం ఎన్నికలకు సన్నాహాలు నాలుగు సంవత్సరాల తర్వాత ప్రారంభమవుతున్నాయి. అంతకుముందు ఫిబ్రవరి 10న కూడా జేఎన్‌యూలో విద్యార్థి సంఘాల సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది.

లక్షద్వీప్‌లో భారత నౌకాదళ స్థావరం

న్యూఢిల్లీ: భారత్ సరికొత్త నౌకాదళ స్థావరాన్ని వచ్చే వారం ప్రారంభించనుంది. దీనికి 'ఐఎన్ఎస్ జటాయు'గా పేరు పెట్టారు. దీంతో హిందూ మహాసముద్రంపై నిఘా మరింత పెంచే అవకాశం లభించనుంది. లక్షద్వీప్‌లోని మినికాయ్ ద్వీపంపై ఏర్పాటు చేసిన ఈ స్థావరంలో తొలుత తక్కువ మంది అధికారులు, సిబ్బంది ఉంటారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో దీనిని అతిపెద్ద నౌకాదళ స్థావరాల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నాయి. విమాన వాహక నౌకలైన ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యపై కమాండర్స్ కాన్ఫరెన్స్ ప్లాన్ జరగనుంది. ఈ రెండు భారీ నౌకలు కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొననుండటం ఇదే తొలిసారి. ఆ సందర్భంగానే జటాయును కూడా ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇప్పటికే తూర్పున అండమాన్-నికోబార్ ద్వీపాల్లో ఉన్న ఐఎన్ఎస్ బాజ్ స్థావరం మాదిరిగా... పశ్చిమాన జటాయు సేవలు అందించనుంది. ఐఎన్ఎస్ జటాయు మాల్దీవుల్లోని ద్వీపాలకు దాదాపు 50 మైళ్ల దూరంలో ఉంటుంది. హిందూ మహాసముద్రంలో సైనిక, వాణిజ్య నౌకల కదలికలను పరిశీలించడానికి భారత్‌కు అవకాశం లభిస్తుంది. మరోవైపు ఎంహెచ్-60 హెలికాప్టర్లను కూడా వచ్చేవారం దళంలోకి చేర్చుకోనున్నారు. గోవాలో నిర్మించిన నౌకాదళ కళాశాలను కూడా ప్రారంభించే అవకాశం ఉంది. జటాయు స్థావరానికి సమీపంలోనే నౌకాదళం ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్యను మోహరించి ఉంచే అవకాశాలున్నాయి. కమాండర్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా నేవీకి చెందిన యుద్ధ విమానాలు ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌పై నుంచి టేకాఫ్ అయి... మరో దానిపై ల్యాండింగ్ కావడం వంటి హైటెంపో ఆపరేషన్లు నిర్వహించనుంది. జలాంతర్గాములు, మరికొన్ని యుద్ధ నౌకలు కూడా క్యారియర్ గ్రూప్ కార్యకలాపాల్లో పాలుపంచుకోనున్నాయి.

చట్టసభ సభ్యుల శరీరాల్లో 'చిప్' పెట్టలా?

పిటిషనర్‌కు సుప్రీం మందలింపు

న్యూఢిల్లీ: సుపరిపాలనలో భాగంగా ఎంపీలు, ఎమ్మెల్యేలను ఎల్లవేళలా పర్యవేక్షించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. చట్టసభ సభ్యులకు గోప్యతా హక్కు ఉంటుందనే విషయాన్ని గుర్తుచేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం... 24 గంటలూ కదలికలను పర్యవేక్షించేందుకు వారి శరీరంలో 'చిప్'ను పెట్టాలా అని ప్రశ్నించింది. ఇటువంటి అంశాలతో కోర్టు సమయం వృథా చేసినందుకు రూ.5 లక్షల జరిమానాతో సిద్ధంగా ఉండాలని పిటిషనర్‌ను హెచ్చరించింది. 'మీరు వాదించి, మేం మీతో ఏకీభవించకపోతే మీ నుంచి రూ.5 లక్షలు రికవరీ చేయాల్సి వస్తుంది. ఇది మా అధికారం గురించి కాదు. ఇది ప్రజా సమయం. ముఖ్యమైనవి అనేక అంశాలున్నాయి. మీరు ఏం వాదిస్తున్నారో అర్థమైందా? ఎంపీలు, ఎమ్మెల్యేలను 24 గంటలూ పర్యవేక్షించాలని కోరుతున్నారు. తప్పించుకొనే దోషులకు మాత్రమే ఇలా చేస్తారు. ఇది గోప్యతా హక్కు కిందకు వస్తుంది. ఎన్నికైన పార్లమెంటు సభ్యులందర్నీ డిజిటల్‌గా పర్యవేక్షించేందుకు వారి శరీరాల్లో చిప్ పెట్టలేం' అని సుప్రీం ధర్మాసనం స్పష్టంచేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేలను గమనించేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దిల్లీకి చెందిన సురేందర్‌నాథ్ కుంద్రా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాలతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజా సేవకులని, కానీ, వాళ్లు పాలకుల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం... అందరు ఎంపీలపై ఉమ్మడి అభియోగం మోపలేరని పేర్కొంది. ఇలాంటి అంశాలతో రావడం కోర్టు సమయాన్ని వృథా చేయడమేనని పిటిషనర్‌ను తీవ్రంగా మందలించింది. పిటిషనర్ అంగీకరించడంతో ఎటువంటి జరిమానా విధించని న్యాయస్థానం సున్నితంగా హెచ్చరిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

హోదా ముగిసిన అధ్యాయం కాదు

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలును డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన జేఏసీ శుక్రవారం తలపెట్టిన చలో సీఎం క్యాంప్ కార్యాలయం కార్యక్రమం సందర్భంగా అనేక మంది నేతలను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయటాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధన, విభజన చట్టం హామీల అమలు విషయంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 25 మంది వైసీపీ ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని ఆనాడు ప్రగల్భాలు పలికిన జగన్ అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చి, మడమ తిప్పారని విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా జగన్‌మోహన్ రెడ్డి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి దాసోహం అంటున్నారని, ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రంపై పోరాడేందుకు ససేమిరా అంటున్నారని పేర్కొన్నారు.

మద్దతు ప్రకటించిన పార్టీల నాయకుల గృహ నిర్బంధం

విద్యార్థి యువజన జేఏసీ అధ్వర్యంలో తలపెట్టిన చలో సీఎం క్యాంపు కార్యాలయం కార్యక్రమం సందర్భంగా అనేక మంది నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన కోసం చేపట్టిన కార్యక్రమానికి సీపీఐ సంఘీభావం ప్రకటించిన నేపథ్యంలో తనను గుంటూరు జిల్లా తాడేపల్లిలో గృహ నిర్బంధం చేశారని చేశారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్ బాబు, కె.శివారెడ్డితో సహా అనేక మంది యువజన, విద్యార్థి నేతలను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ అభివృద్ధి పట్ల కేంద్రం చిన్న చూపుతో వ్యవహరిస్తున్నప్పటికీ జగన్‌మోహన్ రెడ్డి పట్టనట్లు వ్యవహరించడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని, పోలీసులను ప్రయోగించి ప్రజా ఉద్యమాలను అణిచివేసేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నియంతృత్వ, నిరంకుశ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు. సీపీఐ నాయకులను అరెస్టు చేయడం సీపీఐ కార్యాలయాల చుట్టూ, నాయకుల ఇళ్ల చుట్టూ పోలీసులను పెట్టడం గుంటూరు, విజయవాడలో సీపీఐ నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్ పోలీసు రాజ్యాన్ని నడుపుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థి పార్టీల నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడుపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపారని చెప్పారు. సీఎం పనులన్నీ పక్కనపెట్టి పరిపాలన గాలికి వదిలేశారని, పోలీసు యంత్రాంగాన్ని చెప్పు చేతుల్లో పెట్టుకొని అందరిని అరెస్టులు చేయడం, కేసులు పెట్టడం, బెదిరించడం చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం జగన్ ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం చేతనైతే అఖిలపక్ష సమావేశాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ వద్ద ప్రత్యేక హోదా గురించి మాట్లాడే దమ్ము లేక చేతకాక మమ్మల్ని అరెస్టులు చేయడం వల్ల మీకు వచ్చేది ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా అనేది ముగిసిన అధ్యాయం కాదని అన్నారు. బీజేపీ ఈ రాష్ట్రాన్ని మోసం చేసిందని, సీఎం జగన్ బీజేపీ మెడలు వంచి నిగ్గదీస్తాను... నిలదీస్తాను... ప్రత్యేక హోదా సాధిస్తానని మోసం చేశారని, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని పేర్కొన్నారు. ప్రజాతంత్ర వాదులంతా అక్రమ అరెస్టులను, రాష్ట్ర ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించాలని కోరారు.



ఏపీకి సాగర్ కుడి కాలువ ద్వారా నీటి విడుదల

విశాలాంధ్ర-నల్గొండ: కేఆర్ఎంబీ అధికారులు శుక్రవారం నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ నుంచి కుడి కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నీటిని విడుదల చేశారు. వేసవి దృష్ట్యా తాగు నీటి అవసరాల నిమిత్తం నీరు విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వం అభ్యర్థన మేరకు కేఆర్ఎంబీ అధికారులు నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ అధికారులు సాగర్ కుడికాలువ నుంచి రెండు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. తొమ్మిది రోజుల పాటు మూడు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీటి విడుదలను రెండు రాష్ట్రాల నీటి పారుదలశాఖ అధికారులు రీడింగ్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కేఆర్ఎంబీ అధికారులు నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

హమాలీలకు పని భద్రత కల్పించాలి

పౌర సరఫరాలశాఖ అధికారులతో సంఘాల నేతల చర్చలు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్‌లో మండల లెవెల్ స్టాక్ పాయింట్ వద్ద లోడింగ్ అన్‌లోడింగ్ పనులు నిర్వహించే హమాలీలకు పని భద్రత కల్పించి, ధరలు కనుగుణంగా కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆ శాఖ ఎండీ కార్యాలయంలో శుక్రవారం సివిల్ సప్లై అధికారులు, హమాలీ వర్కర్స్ యూనియన్ నేతలతో చర్చలు జరిపారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, హమాలీలకు క్వింటాకు ప్రస్తుతం ఇస్తున్న రూ.25 నుంచి రూ.36కు పెంచాలన్నారు. రూ.ఆరువేల బోనస్‌ను రూ.10వేలకు పెంచాలని కోరారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సిబ్బంది కొరత నివారించాలని సూచించారు. సొంత గోడౌన్లు నిర్మించాలన్నారు. హమాలీలు చనిపోతే మట్టి ఖర్చులకు రూ.30 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ డబ్బులు తక్షణం చెల్లించాలన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చినాంజనేయులు మాట్లాడుతూ, హమాలీల హక్కులు కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ అనారోగ్యంబారిన పడిన హమాలీలందరికీ వైద్య ఖర్చులకు నగదు ఇవ్వాలని కోరారు. కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ, రూ. ఐదు లక్షలు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చల్లో సివిల్ సప్లయ్ జనరల్ మేనేజర్ తులసి, మేనేజర్ రాజబాబు, ప్రవీణ్, శ్రీకాంత్, ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు ఎస్.ముజఫర్, ఎం.మన్మథరావు, టి.వీరబాబు, నరసింహులు, సత్యం గౌరీ, తాతయ్య, ఉమామహేశ్వరరావు, దాసు పైడయ్య ,పెంచలయ్య, మాధవ అయ్యప్ప, కిష్టయ్య, మురారి బాలగురవయ్య, అత్తఉల్లా రామాంజి పాల్గొన్నారు.

మోదీతో మమత భేటీ
మర్యాదపూర్వకమేనని వ్యాఖ్య

కోల్‌కతా: ప్రధాని నరేంద్ర మోదీతో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన కోసం రాష్ట్రానికి వచ్చిన ప్రధాని శుక్రవారం రాత్రికి రాజ్‌భవన్‌లోనే ఉండనున్నారు. ఈనేపథ్యంలో సీఎం మమత, ప్రధానితో సమావేశమయ్యారు. గతేడాది డిసెంబర్‌లో తమ రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ దిల్లీలో కలిసిన తర్వాత మళ్లీ ప్రధాని మోదీని కలవడం ఇదే తొలిసారి. మోదీతో భేటీ అనంతరం మమత మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రపతి లేదా ప్రధానమంత్రి రాష్ట్రాన్ని సందర్శిస్తే ముఖ్యమంత్రి వెళ్లి వారిని కలవడం ఓ ప్రొటోకాల్ అన్నారు. ఇది మర్యాదపూర్వక భేటీయేనని.. రాజకీయ అంశాలేవీ చర్చించలేదన్నారు. ఎందుకంటే ఇది రాజకీయ సమావేశం కాదని చెప్పారు. కాగా తమ రాష్ట్రానికి కేంద్రం నుంచి రూ.1.18లక్షల కోట్ల బకాయిలు రావాలని తృణమూల్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 2022 మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు 30 లక్షల మంది ఉపాధి హామీ కార్మికులకు రూ.2,700 కోట్ల బకాయిల చెల్లింపును రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ప్రారంభించింది.

వకీల్ హసన్ ఇల్లు కూల్చివేత దారుణం

- ఖండించిన కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక
- కేంద్ర చర్యలపై నిరసన ఉధృతం చేయాలని పిలుపు

న్యూదిల్లీ: కేంద్ర ప్రభుత్వం, దిల్లీ అభివృద్ధి మండలి (డీడీఏ) దిల్లీలోని ఖజూరీ ఖాస్ ప్రాంతంలో ర్యాట్ హోల్ మైనర్ వకీల్ హసన్ ఇంటిని బుల్డోజ్ చేస్తూ తీసుకున్న క్రూరమైన, ప్రతీకార, అమానవీయ' చర్యను తొమ్మిది కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ), అనేక స్వతంత్ర రంగ సమాఖ్యలు, సంఘాలు ఖండించాయి. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశాయి. నవంబరు 2023లో ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో సిల్క్యారా సొరంగం కూలిపోవడంతో అందులో చిక్కుకున్న 41 మంది కార్మికులను రక్షించిన ర్యాట్ హోల్ మైనర్ కార్మికుల బృందానికి హసన్ నాయకత్వం వహించాడు. దాదాపు రెండు లక్షల మంది ప్రజలు నివసించే ప్రాంతంలో హసన్‌కు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా అతని ఒక్క ఇంటినే కూల్చివేయడానికి గల కారణాన్ని కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యలు, సంఘాల ఉమ్మడి వేదిక ప్రశ్నించింది. హసన్‌కు సంఘీభావం, మద్దతు తెలుపుతూ, కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి ఆలస్యం లేకుండా వకీల్ హసన్‌కు పరిహారం, నివాస పునరావాసం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. వకీల్ హసన్ రోజుల తరబడి కలిసి అత్యంత కష్టతరమైన కొండ రాతిలో మానవీయంగా తవ్వడం ద్వారా సొరంగంలో చిక్కుకున్న కార్మికుల రక్షించేందుకు వీరోచిత ధైర్యం ప్రదర్శించారని తెలిపాయి. ఆయన అంకితభావం, త్యాగానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విస్తృత ప్రశంసలు లభించాయని పేర్కొన్నాయి. 12 ఏళ్ల నుంచి ముగ్గురు మైనర్ పిల్లలతో సహా నివసిస్తున్న వకీల్ హసన్ నివాసం మాత్రమే కూల్చివేతకు గురికావడం ఆశ్చర్యకరమైనదని తెలిపాయి. అది కూడా లెఫ్టినెంట్ గవర్నర్ చైర్మన్‌గా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీడీఏ నుంచి ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే ఈ కూల్చివేత జరిగిందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి ప్రజావ్యతిరేక, అమానవీయ, ప్రతీకార చర్యకు వ్యతిరేకంగా తమ నిరసనను ఉధృతం చేయాలని శ్రామిక ప్రజలు, కార్మిక సంఘాలకు ఉమ్మడి వేదిక పిలుపునిచ్చింది. ఈ ఉమ్మడి వేదికలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూ టీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ, స్వతంత్ర రంగ సమాఖ్యలు, సంఘాలు ఉన్నాయి.

మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం...
రూ.580 కోట్ల ఆస్తులు స్తంభింపజేసిన ఈడీ

న్యూదిల్లీ: మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. దుబాయ్ కేంద్రంగా హవాలా నిర్వహించే ఓ వ్యక్తికి చెందిన రూ.580 కోట్ల విలువైన సెక్యూరిటీలను ఈడీ అధికారులు స్తంభింపజేశారు. దీంతోపాటు మరో రూ.3.64 కోట్ల నగదు, ఇతర ఆస్తులు స్వాధీనం చేసుకొన్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫిబ్రవరి 28న ఏకకాలంలో కోల్‌కతా, గురుగ్రామ్, దిల్లీ, ఇండోర్, ముంబై, రాయ్‌పూర్ నగరాల్లో తనిఖీలు నిర్వహించింది. ఈ కుంభకోణంలో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలొచ్చాయి. దుబాయ్ కేంద్రంగా పనిచేసే హరిశంకర్ టిబ్రెవాల్ అనే హవాలా ఆపరేటర్ ప్రమేయాన్ని అధికారులు గుర్తించారు. ఇతడి స్వస్థలం కోల్‌కతా. ఇతడు మహదేవ్ యాప్ ప్రమోటర్లతో కలిసి పని చేశాడు. దీంతోపాటు సొంతంగా స్కై ఎక్స్ఛేంజీ పేరిట మరో బెట్టింగ్ యాప్‌ను అక్రమంగా నిర్వహించేవాడు. ఈ నేపథ్యంలో ఇతడి పేరిట ఉన్న రూ.580 కోట్ల విలువైన సెక్యూరిటీలను పీఎంఎల్‌ఏ కింద అధికారులు స్తంభింపజేశారు. ఈ కుంభకోణం నుంచి సంపాదించిన దానిలో యాప్ ప్రమోటర్లు కొంత మొత్తాన్ని ఛత్తీస్‌గఢ్ నాయకులు, అధికారులకు లంచాల రూపంలో సమర్పించినట్లు ఈడీ ఆరోపించింది. ఈ కేసుకు సంబంధించి రెండు చార్జిషీట్లు దాఖలు చేసింది. ప్రమోటర్లు సౌరభ్, రవి ఉప్పల్‌ను ప్రధాన నిందితులుగా పేర్కొంది. ఈ కుంభకోణం మొత్తం విలువ రూ.6,000 కోట్ల వరకు ఉంటుందని ఈడీ అంచనా వేసింది. రవి ఉప్పల్, సౌరభ్ దుబాయ్ కేంద్రంగా భారత్‌లో మహదేవ్ బెట్టింగ్ యాప్ కార్యకలాపాలు నిర్వహించారు. అయితే, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ముసుగులో వీరు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న కోల్‌కతా, భోపాల్, ముంబై వంటి నగరాల్లో సోదాలు నిర్వహించగా... రూ.వందల కోట్లలో అక్రమ నగదు బయటపడింది. బెట్టింగ్ యాప్ ద్వారా వచ్చే మొత్తాన్ని ఆఫ్‌షోర్ ఖాతాలకు తరలించేందుకు హవాలా మార్గాన్ని అనుసరిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. సౌరభ్ వివాహం కోసం రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. గతేడాది నవంబర్‌లో ఈడీ దాడులతో 21 రకాల సాఫ్ట్‌వేర్‌లు, వెబ్‌సైట్లు సహా మహదేవ్ యాప్‌ను కేంద్రం నిషేధించింది. ఆ తర్వాత దీని ప్రమోటర్లపై చర్యలు మొదలుపెట్టింది.

ఊబకాయ భారతం

ఎక్కువమంది బాధితులు చిన్నారులే

న్యూదిల్లీ: భారత్‌లో ఊబకాయం బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని ది లాన్సెట్ జర్నల్ పేర్కొంది. దేశంలో ఊబకాయ బాధితుల్లో అత్యధికంగా చిన్నారులే ఉండటం ఆందోళనకరమని నివేదిక వెల్లడించింది. 1990 నాటితో పోల్చితే 20వ దశాబ్దంలో ఊబకాయుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందింది. 1990లో భారత్‌లో 0.4 మిలియన్ల మంది ఊబకాయంతో బాధపడుతుండగా...2022 నాటికి ఆ సంఖ్య12.5 మిలియన్లకు చేరింది. ఊబకాయ బాధితుల్లో అత్యధికంగా 5 నుంచి 19 సంవత్సరాల వయస్సుగల వారే ఉండటం ఆందోళనకర పరిణామమని పేర్కొంది. 12.5 మిలియన్లలో 7.3 మిలియన్ల మంది బాలురు, 5.2 మిలియన్ల బాలికలు ఉన్నారు. ఊబకాయంతో బాధపడుతున్న పిల్లలు, కౌమారదశలో ఉన్నవారు, పెద్దల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లు దాటింది. ఊబకాయం, తక్కువ బరువు రెండూ పోషకాహార లోపంతోనే వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, యుక్త వయస్కులలో ఊబకాయం 2022లో నాలుగు రెట్లు పెరిగింది. 1990లలో పెద్దవారిలో కనిపించిన ఊబకాయం ఇప్పుడు కౌమారదశలో కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోందని ఇంపీరియల్ కాలేజ్ లండన్ సీనియర్ రచయిత ప్రొఫెసర్ మజిద్ ఎజాటి అన్నారు. అదే సమయంలో మిలియన్ల మంది ఇప్పటికీ పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, పోషకాహార లోపాన్ని అధిగమించడం ప్రభుత్వాల ముందున్న పెద్ద సవాల్ అని చెప్పారు. పెద్దవారిలో ఊబకాయం రేటు మహిళల్లో రెండింతలు, పురుషులలో దాదాపు మూడు రెట్లు పెరిగింది. మొత్తంగా 2022లో 159 మిలియన్ల మంది పిల్లలు, యుక్తవయస్కులు, 879 మిలియన్ల మంది పెద్దలు ఊబకాయంతో బాధపడుతున్నారని అధ్యయనం తెలిపింది. భారత్‌లో వయోజన ఊబకాయం రేటు 1990లో 1.2 శాతం నుండి 2022 నాటికి 9.8 శాతానికి చేరుకుంది. పురుషులలో 0.5 శాతం నుండి 5.4 శాతానికి పెరిగింది. 2022లో దాదాపు 44 మిలియన్ల మహిళలు, 26 మిలియన్ల పురుషులు ఊబకాయంతో బాధపడుతున్నారు. వాతావరణంలో మార్పు, కరోనా మహమ్మారి వల్ల ఏర్పడిన ఆకలి పరిస్థితులు, ఉక్రెయిన్ - రష్యా తదితర యుద్ధాలు పేదరికాన్ని పెంచాయని, తద్వారా ఆహార ధరలు భారీగా పెరిగి పోషకాహారానికి చాలామంది దూరమైనట్లు నివేదిక వెల్లడించింది.

స్నాక్స్, ఫాస్ట్ ఫుడ్, స్ట్రీట్ ఫుడ్‌లో అధిక కేలరీలు ఉంటాయి. ఈ ఆహారాల వల్ల ఊబకాయం వస్తుంది. ఇది కాకుండా మిఠాయి, స్వీట్లు, కూల్ డ్రింక్స్ కారణంగా పిల్లలు బరువు పెరుగుతున్నారు. క్రీడలపై తక్కువ ఆసక్తి ఉన్న పిల్లలు, వ్యాయామం చేయని పిల్లల్లో కెలరీలు కరగట్లేదు. దీంతో ఊబకాయం బారిన పడుతున్నారు. మొబైల్ వినియోగం, టీవీ చూడటం, బద్ధకం ఊబకాయం సమస్యను పెంచుతోంది. పిల్లల తల్లిదండ్రులు లేదా కుటుంబంలోని వ్యక్తులకు ఊబకాయం సమస్య ఉంటే పుట్టే పిల్లలు కూడా అధిక బరువుతో జన్మిస్తారు. కొంతమంది పిల్లలు బరువు పెరగడం వెనుక ఒత్తిడి తదితర కారణాలు ఉంటాయి. ఒత్తిడి ఉంటే అతిగా తినేస్తారు. దీంతో బరువు పెరుగుతారు. శరీరంలో హార్మోన్ల మార్పులు కూడా బరువు పెరగడానికి కారణం కావచ్చు. ఇలా ఏ కారణంతోనైనా బరువు పెరిగితే డాక్టర్లను సంప్రదించి బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. శరీరానికి తగినంత వ్యాయామం చేస్తూ మంచి ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అమెరికాలో భారత నృత్య కళాకారుడిపై దుండగుల కాల్పులు

న్యూయార్క్: కోల్‌కతాకు చెందిన భరతనాట్య, కూచిపూడి నృత్య కళాకారుడు అమర్‌నాథ్ ఘోష్‌ను అమెరికాలో దుండగులు కాల్చిచంపారని నటి దేవలీన భట్టాచార్జి తెలిపారు. అమర్‌నాథ్ ఘోష్ మిసోరిలోని సెంట్‌లూయిస్‌లో మంగళవారం సాయంత్రం సాయంత్రపు నడక చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారని ఆమె ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. సెంట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో ఘోష్ డ్యాన్స్‌లో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (ఎంఎఫ్ఏ) చదువుతున్నారు. ఘోష్ భౌతిక కాయాన్ని భారత్ తరలించేందుకు సహకరించాలని అమెరికాలోని భారత రాయబార కార్యాలయం, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీకి ఆమె విజ్ఞప్తి చేశారు. అమర్ నాథ్ ఘోష్ ఆ కుటుంబంలో ఒక్కడే సంతానమని, అతడి తల్లి మూడేండ్ల కిందట మరణించగా, తండ్రి ఘోష్ చిన్ననాటే మరణించారని నటి పేర్కొన్నారు.

చైనా జెండా వివాదం వేళ...
స్టాలిన్‌కు 'మాండరిన్'లో జన్మదిన శుభాకాంక్షలు

న్యూదిల్లీ: చైనా జెండా ప్రకటన వివాదం వేళ.. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌ను ఉద్దేశించి బీజేపీ వ్యంగ్యంగా పోస్టు పెట్టింది. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పినట్టే చెప్పి, కౌంటర్ ఇచ్చింది. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని కులశేఖర పట్టణంలో నిర్మిస్తోన్న ఇస్రో ప్రయోగ వేదికను ఉద్దేశించి డీఎంకే మంత్రి అనిత ఆర్ రాధాక్రిష్ణన్ ప్రకటన ఇచ్చారు. అందులో ప్రధాని మోదీ, స్టాలిన్ ఫొటోలతో పాటు వెనకవైపున రాకెట్‌పై చైనా జెండా ఉండటం వివాదాస్పదమైంది. దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇది దేశ శాస్త్రవేత్తలు, రోదసీ రంగాన్ని అవమానించినట్లేనని మోదీ అన్నారు. ప్రజల సొమ్ముతో ప్రకటన ఇవ్వడం ద్వారా వారి పన్నులనూ దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఇదిలాఉంటే... ఈరోజు స్టాలిన్ పుట్టినరోజు, బీజేపీ రాష్ట్ర విభాగం ఎక్స్ పోస్ట్‌లో ఆయనకు శుభాకాంక్షలు చెప్పింది. ఇది ఆయనకు ఇష్టమైన భాష అంటూ మాండరిన్‌లో విష్ చేసి, విమర్శించింది. మాండరిన్... చైనా అధికారిక భాష. అయితే తాను ఇచ్చిన ప్రకటనపై దుమారం రేగడంతో మంత్రి అనిత క్షమాపణలు చెప్పారు. 'ప్రకటనలో పొరపాటు జరిగింది. దాని వెనక ఎలాంటి దురుద్దేశం లేదు. మా మనసుల్లో భారత్ పై ప్రేమ ఉంది' అని వివరణ ఇచ్చారు.

ప్రజల వద్ద రూ.8,470 కోట్ల రెండు వేల నోట్లు



ముంబై: చలామణీలో ఉన్న రెండు వేల రూపాయల నోట్లలో 97.62 శాతం తిరిగి బ్యాంకులకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం వెల్లడించింది. ఈ నోటును ఉపసంహరించుకుని తొమ్మిది నెలలు దాటినప్పటికీ... ఇంకా రూ.8,470 కోట్ల విలువైన నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. రూ.2 వేల నోటు ఇప్పటికీ లీగల్ టెండర్‌గా కొనసాగుతుందని ఆర్‌బీఐ మరోసారి స్పష్టం చేసింది. ఈ నోటును కేంద్ర బ్యాంకు గతేడాది మే 19న ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడే నాటికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. బ్యాంకుల్లో నోట్ల మార్పిడి/డిపాజిట్‌కు ప్రజలకు తొలుత సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఇచ్చారు. అనంతరం అక్టోబర్ 7 వరకు ఆ గడువు పొడిగించారు. ఆ తర్వాత నుంచి ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మాత్రమే ఈ నోట్లు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 29 నాటికి 97.62 శాతం నోట్లు వెనక్కి వచ్చాయని రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల వద్ద నోట్లు ఎక్స్ఛేంజీ/ డిపాజిట్ చేసుకోవచ్చని కేంద్ర బ్యాంక్ తెలిపింది. రీజనల్ ఆఫీసులకు చేరుకోలేనివారు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆయా కార్యాలయాలకు వాటిని పంపించొచ్చని పేర్కొంది. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గువహతి, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగపూర్, దిల్లీ, పాట్నా, తిరువనంతపురంలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి.

కేంద్ర కీలక పదవుల్లోకి 25 మంది ప్రైవేటు రంగ నిపుణులు



న్యూదిల్లీ: కేంద్ర ప్రభుత్వంలోని కీలక పదవుల్లోకి 25 మంది ప్రైవేటు రంగ నిపుణులు చేరనున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఇటీవల ఈ నియామకాలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ముగ్గురు జాయింట్ సెక్రటరీలు, 22 డైరెక్టర్లు/ డిప్యూటీ సెక్రటరీలను నియమించాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాలనను మెరుగుపరిచే ఉద్దేశంతో మోదీ సర్కారు ఈ విధానాన్ని తీసుకొచ్చింది. సాధారణంగా జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీ పోస్టులను ఆలిండియా సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, ఇతర గ్రూప్-ఏ సర్వీసులకు చెందిన వారితో భర్తీ చేస్తారు. కానీ, ప్రభుత్వ పాలనలో కొత్త ప్రతిభను ప్రవేశపెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం 25 మంది ప్రైవేటు నిపుణుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. లేటరల్ ఎంట్రీగా వ్యవహరించే ఈ స్కీమ్‌ను 2018 లోనే ప్రవేశపెట్టారు. ప్రభుత్వం తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో వీరు కీలకంగా వ్యవహరిస్తారు. ఈ పథకం కింద 10 జాయింట్ సెక్రటరీ ర్యాంక్ పోస్టులకు తొలుత దరఖాస్తులు ఆహ్వానించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాలు చేపడుతుంది. 2021 అక్టోబర్‌లో మరోసారి యూపీఎస్సీ 31 మందిని సిఫార్సు చేసింది. ఇప్పటి వరకు 10 మంది జాయింట్ సెక్రటరీలు, 28 మంది డైరెక్టర్లు/ డిప్యూటీ సెక్రటరీలు ప్రభుత్వ విధుల్లో చేరారు. ప్రస్తుతం 33 మంది వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో ఆయా రంగాల్లో నిష్ణాతులైన ప్రైవేటు రంగానికి చెందిన వ్యక్తులు గానీ, రాష్ట్ర ప్రభుత్వ/ స్వతంత్ర వ్యవస్థలు/ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్‌కు చెందిన వ్యక్తులు గానీ నియమితులు కావొచ్చు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA/ VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.